Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 143 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 జూన్ 2023 బుధవారం పేజీలు : 4

## మెట్రో రైళ్లకు పోటెత్తిన ప్రయాణికులు

హైదరాబాద్ : మెట్రో రైళ్లకు ప్రయాణికులు పోటెత్తారు. ఎండల తీవ్రత పెరగడంతో మెట్రోకు హైదరాబాద్ నగరవాసులు క్యూ కడుతున్నారు. ఆ రద్దీని చూస్తుంటే.. ముంబై మెట్రోను తలపిస్తోంది. ప్రయాణికులతో అమీర్ పేట్ మెట్రో స్టేషన్ కిక్కిరిసిపోయింది. గత వారం రోజులుగా రోజుకు నాలుగున్నర లక్షల మందికి పైగా మెట్రోలో ప్రయాణం చేస్తున్నారు. కెపాసిటీకి మించి మెట్రోలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. మెట్రో సర్వీసుల సంఖ్య పెంచాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి హైదరాబాద్‌కు మెట్రో వచ్చిన తొలినాళ్లలో తీవ్ర నష్టాలను చవిచూసింది. అప్పట్లో ప్రయాణ ఖర్చులు చాలా భారంగా అనిపించేవి. దీంతో సామాన్యులెవరూ మెట్రోజోలికి వెళ్లేవారు కాదు. పైగా అన్ని ప్రాంతాలకూ రవాణా సౌకర్యం లేకపోవడం కూడా పెద్ద మైనస్ అనే చెప్పాలి.



# ఔనన్నా... కాదన్నా... మళ్ళీ మోడీనే!

దేశంలో కుర్చీలు ఎపుడూ ఖాళీగా ఉండవు. వారిని బలవంతంగా ఖాళీ చేయిస్తారు. దానికి జనాల మద్దతు కూడగడతారు. అలా ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమించి జనం మద్దతు దక్కించుకుని కుర్చీలను ఎక్కేవారిని నాయకులు అంటారు. అలా ఇప్పటికి రెండు విడతలుగా దేశ ప్రధాని పీఠాన్ని అధిరోహించిన నరేంద్ర మోడీ హ్యాట్రిక్ వీరుడు కావాలని చూస్తున్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో మళ్ళీ బీజేపీదే విజయం అని ఒక జాతీయ చానల్ సర్వే చేసి బయటపెట్టింది. దాంతో కమలనాథులలో ఉత్సాహం పొంగిపొరలుతోంది. ఆ విషయం అలా ఉంచితే ఈ మధ్య జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా బీజేపీ నిలబెట్టిన అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఇక విపక్ష శిబిరం చూస్తే కకావికలైంది. ఒక రాజకీయ వ్యూహం అన్నది లేకుండా నిస్సహాయంగా ఎలా ఉంది అన్నదే తెలియచేస్తోంది. ఈ నేపథ్యంలో నుంచి చూస్తే బీజేపీకి ఎదురులేదు అన్న భావన రాజకీయ వర్గాలలోనే కాదు సగటు జనాలలో కూడా ఎంతో కొంత ఉంది. ఇక మళ్లీ ఎన్నికలు జరిగితే మోడీ మూడవసారి ప్రధాని అవడం ఖాయమని భావిస్తున్నారు. కానీ బీజేపీలో చూస్తే సీన్ అలా లేదు. ప్రధాని పదవికి పోటీ చాలా గట్టిగానే ఉంది. సీనియర్ మంత్రి ఆరెస్సెస్ కి దగ్గరవాడు అయిన నితీన్ గడ్కరీ నుంచి మోడీకి తీవ్రమైన పోటీ ఈసారి ఎదురు కావచ్చు అని అంటున్నారు. అలాగే యూపీలో రెండు సార్లు గెలిచి ఘనమైన సీఎం గా ఉన్న యోగీ ఆదిత్యనాథ్ కూడా రేసులో ముందుకు వస్తున్నారు. మరి కొన్ని పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వారిలో సీనియర్లు ఉన్నారు. ఈ సమయంలో మోడీయే మన ప్రధాని అభ్యర్థి ఈ విషయంలో రెండవ మాటకు తావు లేదు అంటూ అమిత్ షా తాజాగా చేసిన ప్రకటన సంచలనమే నమోదు చేసింది. నిజానికి ఇది సందర్భం అయితే కానే కాదు ఇంకా ఎన్నికలకు చాలా దూరం ఉంది. బీజేపీలో ఇలాంటి ప్రకటనలు చేయడం వ్యక్తిగత స్థాయిలో కూడా సాధ్యపడదు పార్లమెంటరీ బోర్డు డిసైడ్ చేస్తుంది. అయితే అటు పార్టీని ఇటు ప్రభుత్వాన్ని ఒంటి చేత్తో నడిపిస్తూ చక్రం తిప్పుతున్న మోడీ అమిత్ షాలకు జాతీయ బోర్డు అన్నది కూడా ఒక లాంచనమే అనుకోవాలి. అందుకే చాలా ఉత్సాహం చూపించి మోడీయే మా ప్రధాని క్యాండిడేట్ అని అమిత్ షా చెప్పుకొచ్చారు. దీని వెనక పక్కా వ్యూహం ఉంది. విపక్షల కోసం చేసిన ప్రకటన ఇది అంతకంటే కాదు అని కూడా

## బీజేపీలో ఏం జరుగుతోంది : ఇచ్చట ప్రధాని పదవి ఖాళీ లేదు...?

తెలుస్తోంది. బీజేపీలో ఉన్న ప్రధాని పోటీదారులకు గట్టి సందేశం వినిపించాలన్న ఉద్దేశ్యంతోనే అమిత్ షా ఇలా ప్రకటించారని అంటున్నారు. ఆయన వెనక మోడీ ఉన్నారని కూడా చెబుతున్నారు. మరో ఇరవై నెలలు చేతిలో అధికారంలో ఉంచుకుని మోడీ మూడవసారి నేనే అని చెప్పుకోవడం అంటే అది అతి ఉత్సాహమే అవుతుంది. అందువల్ల కాగల కార్యాన్ని అలా అమిత్ షాతో నెరవేర్చారు అని అంటున్నారు. ఇక్కడ మరో విషయం ఉంది. క్యాడర్ కి కూడా ఇదే సందేశం. బీజేపీ అంటే మోడీ ఆయన వెనక షా తప్ప మరొకరు కాదు అని చెప్పడం అన్న మాట. ఇక బీజేపీలోని ఆశావహులకు నో చాన్స్ ని చెప్పడానికి కూడా ఈ ప్రకటనను వాడుకుంటున్నారు అనుకోవచ్చు. మొత్తం మీద బీజేపీలో ప్రధాని పదవికి పోటీ అన్నది ఉండరాదు అలాంటి ఊహాగానాలకు తావు ఇవ్వరాదు అన్న విధంగా మోడీ షా తెలివిగా ఈ వ్యూహం పన్నారని అంటున్నారు. మరో వైపు చూస్తే ప్రధాని పదవి అన్నది మోడీ షాల మధ్యనే ఉండాలి తప్ప మిగిలిన నాయకుల మధ్యన అసలు కాదు వారిని లెక్క తీయడానికి లేదు అన్న అద్భుతమైన సందేశం వినిపించేందుకే ఈ అర్జంటు స్టేట్మెంట్ అంటున్నారు. మోడీ మూడవసారి ప్రధాని అయితే ఆయన చేయగలిగినన్నాళ్ళు చేసిన మీదటన తదుపరి ప్రధాని అయ్యేది అమిత్ షాయే అని కూడా చెబుతున్నారు. ఈ ఇద్దరు మిత్రుల బంధంతో రాజకీయ పందెంతో బీజేపీ ప్రధాని పదవిని తమ వాకిట కట్టేసుకున్నారని కమలదళం ఇపుడు కుమిలినా ప్రయోజనం లేదు. ఎందుకంటే పార్టీ ఎపుడో ఈ ఇద్దరితోనే అన్నట్లుగా ఉంది కనుక.

## కవితపై కేసు తలనొప్పిగా మారిందా?



ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కవితపై సీబీఐ కేసు బీజేపీకి పెద్ద తలనొప్పిగా మారింది. లిక్కర్ స్కామ్ లో సౌత్ గ్రూప్ తరపున కల్వకుంట్ల కవితే సూత్రదారని సీబీఐ ఈడీ పదేపదే చెప్పాయి. స్కామ్ లో చేతులుమారిన డబ్బులు. 150 కోట్లే. ఎమౌంట్ తక్కువే అయినా ఇందులో ఇరుక్కున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల నేపథ్యం కారణంగా కేసు దేశంలోనే సంచలనంగా మారింది. కవిత అరెస్టుపై బీజేపీ చీఫ్ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలే కమలానికి ఎంత తలనొప్పిగా మారిందో అర్థమైపోతోంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కల్వకుంట్ల కవిత మనీష్ శిసోడియా సత్యేంద్రజైన్ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు ఆయన కొడుకు ఒక అరబిందో ఫార్మా కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి కవిత భర్త అనీల్ తదితరులపై అనేక ఆరోపణలు వినబడుతున్నాయి. ఇంతమంది ప్రముఖులు ఇరుక్కున్నారు కాబట్టే కేసు సంచలనంగా మారింది. మిగిలిన వాళ్ళను పక్కనపెట్టినా కవిత వ్యవహారం మాత్రం తెలంగాణాలో హాట్ టాపిక్ అయిపోయింది. కవిత అరెస్టవుతుందని అందరు అనుకున్నారు. ఇదే విషయాన్ని కేసీయార్ కూడా ప్రకటించారు. అయితే ఈడీ ఇంతవరకు కవితను అరెస్టు చేయలేదు. దాంతో బీజేపీ బీఆర్ఎస్ కుమ్మక్కయినట్లు కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై బండి మాట్లాడుతు స్కామ్ ను సీబీఐ ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దర్యాప్తు జరుగుతోంది కాబట్టి కవితను ఇంకా అరెస్టు చేయలేదేమో అన్నారు. కవితను అరెస్టుచేయనంత మాత్రాన బీజేపీ బీఆర్ఎస్ కుమ్మక్కైనట్లు ఆరోపిస్తే ఎలాగంటు మొత్తుకున్నారు. తప్పుచేసిన వాళ్ళెంతటి వాళ్ళయినా జైలుకు వెళ్ళక తప్పదని చెప్పారు. అయితే బండి చెప్పిందే నిజమైతే మరి దర్యాప్తు చేస్తున్నపుడే కదా స్కామ్ లో పాత్రదారులంటు చాలామందిని అరెస్టుచేసింది. మరి దర్యాప్తు జరుగుతుండగానే వీళ్ళని ఈడీ ఎలా అరెస్టుచేసినట్లు ? విచారణ చేసిన వాళ్ళల్లో కేజ్రీవాల్ కవిత అనీల్ ను మాత్రమే ఈడీ అరెస్టుచేయలేదు. మిగిలిన వాళ్ళందరినీ అరెస్టుచేసిన విషయం తెలిసిందే. ఇంతమందిని అరెస్టుచేసిన ఈడీ కవితను అరెస్టు చేయకపోవటంతోనే బీజేపీ–బీఆర్ఎస్ మధ్య ఒప్పందం జరిగినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఇదే రెండుపార్టీలకు మధ్య పెద్ద సమస్యగా మారేట్లుందని అనుకుంటున్నారు.

## ఉద్యోగాల హబ్‌గా సిద్దిపేట.. మెగా జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు




సిద్దిపేట : సిద్దిపేట బిడ్డలకు సిద్ధిపేటలోనే ఉద్యోగాలు చేసే అవకాశం రావడం సంతోషం అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని జిల్లాలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో స్థానికులకే స్థానిక ఉద్యోగాలు పేరిట ప్రముఖ 15 ఐటీ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో జిల్లా కేంద్రమైన సిద్దిపేటకు ఐటీ టవర్ రావడం సంతోషంగా ఉందని తెలిపారు. మీ జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరాలని, గతంలో ఏం చేశారనే–గ్యాప్ ఎందుకుందనే అంశం ఐటీ సెక్టారులో అడిగే ఆస్కారం ఉన్నందున ముందు ఈ ఐటీ హబ్‌లో ఉద్యోగ అవకాశం పొందితే మీ కెరీర్ గ్యాప్ లేకుండా ఉంటుందని మంత్రి చెప్పుకొచ్చారు. సిద్దిపేటలో సైతం 718 సీటింగ్ కెపాసిటీతో నిర్మించిన ఐటీ టవర్‌లో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడం సంతోషకరంగా ఉన్నదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రూ.63 కోట్ల వ్యయంతో సిద్దిపేటలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టినట్లు, ఈ నెల 15వ తేదీన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఓఎస్ఐ డిజిటల్, జోలాన్ టెక్, విసన్ ఇన్ఫో టెక్, అమిడాయ్ ఎడ్యుటెక్, ఫిక్సిటీ టెక్నాలజీస్, ఇన్ఫోసోల్, థోరాన్ టెక్నాలజీస్, బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్, ర్యాంక్ ఐటీ సర్వీసెస్, తదితర కంపెనీలు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. షిఫ్టు బేస్డ్‌గా 718 మంది ఉద్యోగులు ఉంటారని, రెండు షిఫ్టులకు 1436 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు పద్ధతులు స్టేజ్–1లో 718, స్టేజ్–2 లో మరో వెయ్యి మందికి ఉద్యోగాలు రానున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందే ఉద్యోగార్థులకు టాస్క్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు, కేవలం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ బ్యాచ్ లో 150 మంది నిరుద్యోగ అభ్యర్థులకు 45 రోజులు పాటు టాస్క్ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. టాస్క్ శిక్షణ పొందిన తర్వాత ఎక్కడైనా ఐటీ, తదితర రంగాలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని మంత్రి వెల్లడించారు. ఇవాళ 718 మంది ఉద్యోగార్థులను ప్రముఖ కంపెనీలు ఎంపిక చేసుకుంటాయని, అన్నీ చదువులు సిద్దిపేటలో ఉన్నాయని, ఇప్పటికే సిద్దిపేట విద్యా క్షేత్రంగా నిలిచిందని, ఇవాళ్టి నుంచి ఉద్యోగాల హబ్‌గా మారిందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ చైర్మన్ మంజుల–రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజిత–వేణు గోపాల్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని పార్టీల్లోనూ అదే లొల్లి

## కేసీఆర్ కోవర్టులంటూ ఒకటే గోల

హైదరాబాద్ : ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తెలంగాణాలో కోవర్టుల గోల పెరిగిపోతోంది. కాంగ్రెస్ బీజేపీ బీఎస్పీలో కేసీయార్ కోవర్టులు ఉన్నారనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. తన కోవర్టులను ఇతర పార్టీల్లోకి ప్రవేశపెట్టడం కేసీయార్ కు చాలా అవసరమని ఇతర పార్టీల్లోని నేతలంటున్నారు. తన కోవర్టులిచ్చిన సమాచారం ఆధారంగానే ప్రత్యర్థిపార్టీలను ఇబ్బందిపెట్టేట్లుగా కేసీయార్ వ్యూహాలు రచిస్తుంటారనే ప్రచారానికి ఆరోపణలకు కొదవేలేదు. కేసీయార్ కోవర్టుల విషయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్వయంగా అంగీకరించారు. అలాగే బీజేపీ నేతలు కూడా దీన్ని పరోక్షంగా అంగీకరించారు. చాలాకాలం కిందట రేవంత్ మాట్లాడుతు పార్టీలోని కేసీయార్ కోవర్టులంతా వెంటనే బయటకు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వెళ్ళటం ఇష్టంలేకపోతే కోవర్టు పనులు మానుకుని పార్టీకోసమే పనిచేయాలని బంపర్ ఆఫరిచ్చారు. అంటే దీని అర్థమేంటి ? కాంగ్రెస్ లో కేసీయార్ కోవర్టులున్నారని రేవంత్ అంగీకరించినట్లే కదా. అందుకనే వెంటనే కేసీయార్ కోవర్టులెవరో చెప్పాలంటు బహిరంగంగానే కొందరు సీనియర్లు రేవంత్ ను డిమాండ్ చేశారు. ఇప్పటి సంగతి తెలీదుకానీ ప్రత్యేక తెలంగాణా ప్రకటించకముందు చాలామంది కాంగ్రెస్ నేతలు కేసీయార్ కు అనుకూలంగా పనిచేశారనే ప్రచారం జరిగింది. కేసీయార్ చెప్పిన మాటలనే కాంగ్రెస్ సీనియర్ నేతల్లో చాలామంది సోనియాగాంధి రాహుల్ గాంధీలకు తమ సొంత అభిప్రాయాలుగా చెప్పినట్లు అప్పట్లో బాగా ఆరోపణలొచ్చాయి. చివరకు ప్రత్యేక తెలంగాణా ప్రకటించగానే టీఆర్ఎస్ ను కేసీయార్ కాంగ్రెస్ లో కలిపేస్తారని నమ్మబలకటం కూడా కోవర్టుల వ్యూహమేనని చెప్పుకున్నారు. ఇక బీజేపీలో కూడా కేసీయార్ కోవర్టులున్నారని ఈమధ్యనే ఆరోపణలు మొదలయ్యాయి. మరా కోవర్టులను పార్టీ గుర్తించిందా లేదా అన్నది తెలీలేదు. ఇక బీఎస్పీలో కేసీయార్ కోవర్టులంటేనే ఆశ్చర్యంగా ఉంది. బీఎస్పీకి ఉన్నదెంత పోయేదెంత ? రాబోయే ఎన్నికల్లో పోటీచేస్తే కానీ బీఎస్పీకి ఉన్న సీనేంటో తెలీదు. ఇంతోటిదానికి బీఎస్పీలో ప్రత్యేకంగా కేసీయార్ కోవర్టులను ప్రవేశపెట్టాలా అన్నదే ఆశ్చర్యంగా ఉంది.

ఏదేమైనా ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ పై పార్టీల్లో కేసీయార్ కోవర్టులనే గోల కూడా పెరిగిపోతోంది. మరి కోవర్టులు ఎప్పటికి బయటపడతారో ఏమో చూడాల్సిందే.

# సంపాదకీయం

## సీబీఐకి ఆ అధికారం ఉందా?

ప్రస్తుతం ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీబీఐ దేశంలో పలు కేసులను విచారిస్తున్నాయి. ఏపీ సీఎం వైఎస్ జగన్ పై అక్రమాస్తుల కేసును సీబీఐ విచారిస్తోంది. అలాగే జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పై పలు కేసులున్నాయి. ఆయనపై ఈడీ కేసులు నమోదు చేసింది. అలాగే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి కేసులున్నాయి. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు తాజాగా కేజ్రీవాల్ ను తొమ్మిది గంటలపాటు విచారించారు. ఆయనను మొత్తం 56 ప్రశ్నలు అడిగారు. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ను ఒక దశలో సీబీఐ అరెస్టు చేయొచ్చనే ప్రచారం కూడా సాగింది. అయితే తొమ్మిది గంటల విచారణ అనంతరం సీబీఐ అధికారులు ఆయనను అరెస్టు చేయకుండా వదిలిపెట్టేశారు. ఈ నేపథ్యంలో సీబీఐకి ముఖ్యమంత్రులను ప్రధానమంత్రిని నేరుగా అరెస్టు చేయగల అధికారం ఉందా? లేదా? అనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. సివిల్ కేసుల్లో మాత్రం ప్రధానమంత్రి కేంద్ర మంత్రులు లోక్ సభ రాజ్యసభ సభ్యులు ముఖ్యమంత్రి శాసనసభ శాసన మండలి సభ్యులకు అరెస్టు నుంచి మినహాయింపు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. క్రిమినల్ కేసుల్లో మాత్రం ఈ సెక్షన్ వర్తించదని పేర్కొంటున్నారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంట్ శాసన సభ శాసన మండలి సభ్యుడిని అరెస్టు చేయాలన్నా నిర్బంధించాలన్నా స్పీకర్ సభ చైర్మన్ ఆమోదం తప్పనిసరి. అంతేకాక.. పార్లమెంటు ఆవరణ శాసన సభ శాసన మండలి ఆవరణాల్లో ఏ సభ్యుడిని అరెస్టు చేయడం నిర్బంధించడం కుదరదని ఈ సెక్షన్ చెబుతోందని అంటున్నారు. ఇక క్రిమినల్ కేసులు అయితే ఎవరిని అయినా అరెస్టు చేయొచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ సమాచారాన్ని స్పీకర్ లేదా చైర్మన్ కు ఇవ్వాల్సి ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రులు పార్లమెంటు శాసనసభల్లో ఏదో ఒకదానిలో సభ్యులే కాబట్టి వారిని కూడా అరెస్టు చేయొచ్చని పేర్కొంటున్నారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం.. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో ఉండగా నిర్బంధించడం అరెస్టు చేయడం సాధ్యం కాదని వివరిస్తున్నారు. వారికి వ్యతిరేకంగా ఏ కోర్టు కూడా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెబుతున్నారు. వీరికి సివిల్ క్రిమినల్ కేసులలోనూ మినహాయింపు ఉందని పేర్కొంటున్నారు. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో లేకపోతే లేదా పదవీకాలం ముగిస్తే వారిని అరెస్టు చేయొచ్చని వివరిస్తున్నారు.

# కబ్జాలు కనిపించవా..!



మెదక్ : చిన్నపాటి స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే అధికారులు నానా హంగామా చేస్తారు. కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ ప్రథమ కర్తవ్యమంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు గజాలు కాదు.. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించేస్తున్నా వారికి కనిపించవు. ఒకవేళ కట్టడికి ముందుకు కదిలినా నేతలు ఎక్కడికక్కడ వారిని అడ్డుకుంటారు. అప్పుడు నియమ నిబంధనలన్నీ పక్కనపెట్టి.. మనకెందుకొచ్చిన సమస్య అంటూ వారూ అటువైపు వెళ్లడానికి సాహసించరు. సరిగ్గా నర్సాపూర్‌లోని సర్వే సంఖ్య 79లో ఉన్న విలువైన ప్రభుత్వ భూముల్లో ఇదే జరుగుతోంది. సదరు సర్వే సంఖ్యలో 183 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. నర్సాపూర్ నుంచి హైదరాబాద్‌కు, నర్సాపూర్ నుంచి శివ్వంపేట, తూప్రాన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన ఈ భూములున్నాయి. ఇందులో కొంత విస్తీర్ణంలో మార్కెట్ యార్డు, రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. నిరుపేదలకు సాగు చేసుకునేందుకు గతంలో కొంత మేర పంపిణీ చేశారు. మిగతాది ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం విలువ రూ.25వేలకు పైగా పలుకుతోంది. ఇంతటి విలువైన చోట ఉన్న ప్రభుత్వ స్థలాన్ని నేతలు, వారి అనుచరులు కొల్లగొడుతున్నారు. రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టి తమ పరం చేసుకుంటున్నారు. ఈ సర్వే సంఖ్యలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు గతంలో రెవెన్యూ యంత్రాంగం సర్వే నిర్వహించింది. దాదాపు 50వరకు అక్రమ నిర్మాణాలున్నట్లు గుర్తించారు. చర్యలు తీసుకునే లోపే రాజకీయ నేతలు రంగప్రవేశం చేసి ఆపేశారు. దీంతో మళ్లీ కొందరు దర్జాగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన సదరు సర్వేసంఖ్యలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేస్తున్నారు. స్థానిక నేత అనుచరుడొకరు దుకాణాలకు అద్దెకిచ్చేలా నిర్మాణం చేపట్టారు. దీనిని కూల్చేందుకు అధికారులు వెళ్లారు. అయినా వాళ్లు ఏమీ చేయకుండానే వెనుదిరగక తప్పలేదు. ఆ నేత తన పలుకుబడితో ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు.

నర్సాపూర్ పురపాలిక పరిధిలోని కొందరు నేతలు ఈ స్థలాలపై కన్నేశారు. పేదల ముసుగులో చిన్న చిన్న నిర్మాణాలు చేపడుతున్నారు. తమ అధికారబలంతో గదులు కట్టేసి.. ఆపై ఇతరులకు విక్రయిస్తున్నారు. తమ పేర్లు బయటకు రాకుండా ఇలా సొమ్ము చేసుకుంటున్నారు. 'ఈ సర్వేసంఖ్యలో వెలిసిన నిర్మాణాలేవీ పేదలవి కావు.. అంతా పెద్దలవే. రాజకీయ ప్రాబల్యంతో వారే కబ్జాలకు పాల్పడుతున్నారు. మేం చర్యలు తీసుకోలేని పరిస్థితి' అంటూ తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి అసలు విషయాన్ని వివరించారు.

నర్సాపూర్- శివ్వంపేట ప్రధాన రహదారి పక్కన గతంలో పేదలకు సాగు చేసుకునేందుకు భూములు పంపిణీ చేశారు. వాటిలో ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్మాణాలు చేపట్టకూడదు. కేవలం సాగు మాత్రమే చేసుకోవాలి. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఆ భూములను వెనక్కి తీసుకుంటుంది. ఇక్కడ అలాంటిదేమీ లేదు. పదుల సంఖ్యలో దుకాణ సముదాయాలు, ఇతరత్రా వ్యాపార కార్యకలాపాల కోసం వాడుకుంటున్నారు. శాశ్వత నిర్మాణాలతో పాటు షెడ్లూ కట్టారు. ఇప్పటి వరకు సర్వే సంఖ్య 79లో ఎంత భూమిని ప్రభుత్వ అవసరాల కోసం వాడుకున్నారు. ఇప్పుడు ఎంత భూమి ఖాళీగా ఉందనే సమాచారం కోసం తహశీల్దారు కార్యాలయంలో సంప్రదించగా.. ప్రస్తుతం ఆ వివరాలు అందుబాటులో లేవని సమాధానం వచ్చింది.

అవి ప్రభుత్వ భూములే...- భాస్కర్, తహశీల్దారు, నర్సాపూర్

నిర్మాణానికి సంబంధించి ఎవరికీ భూములు కేటాయించలేదు. అవన్నీ ప్రభుత్వ భూములే. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకుంటాం.

# సీజనల్ వ్యాధులే.. ఆందోళన వద్దు



మెదక్ : వాతావరణ మార్పులు, పరిసరాల అపరిశుభ్రతతో వ్యాధులు విస్తరిస్తున్నాయని, ఆందోళన చెందొద్దని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో రెండు రోజులుగా పెద్ద సంఖ్యలో ప్రజలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో కాళ్లకల్‌లో ఆయన పర్యటించారు. వైద్యశిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులుగా 15 మంది తీవ్ర అస్వస్థతకు గురవగా, నలుగురికి శిబిరంలోనే ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని చెప్పారు. గ్రామంలో చనిపోయిన మహిళ, యువకుడు పోస్టుమార్టం తర్వాత కారణాలు తెలుస్తాయన్నారు. ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిని వేడి చేసుకొని చల్చార్చి తాగాలన్నారు. వైద్య సిబ్బంది సోమవారం రాత్రి నుంచి అందుబాటులో ఉండి ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తూ తగు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. రహదారులపై బండ్లు, హోటళ్లలో ఆహార పదార్థాలను పరిశీలించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి నమూనాల సేకరణకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ నవనీత, సర్పంచి నత్తి మల్లేశ్, డీఎల్పీవో శ్రీనివాసరావు, తెరాస మండలాధ్యక్షుడు మహేష్, పీహెచ్‌సీ వైద్యుడు ఆనంద్‌రెడ్డి తదితరులున్నారు.

5233 మందికి పరీక్షలు..స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తూప్రాన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, డీపీవో తరుణ్‌కుమార్‌లు శిబిరాన్ని సందర్శించి అస్వస్థతకు గురైన వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. వీధుల్లో ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన వాన నీరు, ప్లాస్టిక్ కాగితాలను చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు 1,115 ఇళ్లు సర్వే చేసి 5233 మందిని పరీక్షించారు. జ్వరం బాధితులు 15 మంది, 12 మందికి విరేచనాలు, 10 మందికి వాంతులు అవుతున్నట్లు గుర్తించారు. ఇంటింటికీ క్లోరిన్ బిళ్లలను అందించారు. ఇంటెలిజన్స్ డీఎస్పీ సంజీవరావు గ్రామంలో పర్యటించి పూర్తి వివరాలు సేకరించారు.

# బాలికా ఆరోగ్య రక్ష.. ఏదీ శ్రద్ధ?

మెదక్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుకునే విద్యార్థినులకు ప్రభుత్వం ఆరోగ్యకిట్లను అందించాలని నిర్ణయించింది. అత్యధికులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి వారే కాగా, ఆరోగ్య పరిరక్షణపై సరైన అవగాహన లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోలేకపోతున్నారు. దీన్ని గమనించిన ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆయా మండలాల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న నిర్దేశిత వయసున్న వారికి సరఫరా చేసే వారు.

13 రకాల వస్తువులు..

కిశోర బాలికలకు ప్రతి మూడు నెలలకోసారి కిట్లను అందించారు. ఇందులో శానిటరీ న్యాప్‌కిన్లు, స్నానం సబ్బులు, బట్టల సబ్బులు, బొట్టు బిళ్లలు, షాంపూ, తలనూనె, దువ్వెన, పౌడరు, టూత్‌పేస్టు, పళ్లు తోముకునే బ్రష్, టంగ్ క్లీనరు, రబ్బరు బ్యాండ్లు, రిబ్బన్లు ఇలా 13 రకాల వస్తువులు ఉంటాయి. పేద విద్యార్థినులకు ఇవెంతో ఉపయోగపడేవి.

కరోనా విజృంభణతో..

కరోనా వ్యాప్తితో 2000 మార్చిలో పాఠశాలలను మూసివేశారు. ఏడాదిన్నర కాలం తర్వాత 2021 సెప్టెంబరులో పునఃప్రారంభించారు. ఈ ఏడాది జూన్ 13 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైంది. మూడునెలలకోసారి కిట్లను అందజేయాల్సి ఉండగా చివరి సారి 2020 డిసెంబరులో పంపిణీ చేశారు. ఇక అప్పటి నుంచి వాటి ఊసే లేదు. విద్యార్థినిలకు అవసరమైన సామాగ్రిని ఆర్థిక పరిస్థితుల కారణంగా కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో వారు ప్రతి నెల ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి కిట్లు రాగానే వాటిని విద్యార్థినులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

బయట కొనుక్కుంటున్నాం..: వైష్ణవి, విద్యార్థినిగతంలో ఆరోగ్య కిట్లు ఇచ్చారు. పాఠశాలల ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వలేదు. అవసరమైన వస్తువులను బయట కొనుక్కుంటున్నాం. వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని అందరూ చెబుతున్నారు. కిట్లను వెంటనే ఇస్తే బాగుంటుంది.సొంత ఖర్చులతో..: వర్షితనేను తొమ్మిదో తరగతి విద్యార్థిని. గతంలో ఆరోగ్య కిట్లు ఠంచనుగా ఇచ్చేవారు. రెండేళ్లుగా ఇవ్వడం లేదు. దీంతో సొంత ఖర్చులతో సమకూర్చుకోవాల్సి వస్తోంది. వెంటనే కిట్లను ప్రభుత్వం అందజేయాలి.

# కేజీబీవీల్లో బోధకులు ఏరీ..?

కొత్తగూడెం : నిరుపేద, అనాథ బాలికలకు మంచి విద్యను అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. పూర్తి స్థాయిలో బోధకులు లేక లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. తమ పిల్లలకు బాగా చదువుకునే అవకాశం వచ్చిందనే కొండత ఆశతో ఎంతో మంది నిరుపేదలు ఈ విద్యాలయాల్లో చేర్పిస్తే.. వారి ఆకాంక్షలపై అధికార యంత్రాంగం నీళ్లు చల్లుతోంది. విద్యాలయాల ప్రారంభంలో సౌకర్యాల కల్పన బాగున్నా.. కాలక్రమేణా వీటిలో బోధనా వసతులు సకాలంలో సమకూర్చడంతో



అధికారులు విఫలమవుతున్నారు. విద్యాశాఖ ఏటా చెప్పే మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. ఇప్పటికే అన్ని విద్యాలయాల్లో పాఠ్యాంశ బోధన ప్రారంభమై నెల రోజులు పూర్తయి రెండో మాసం నడుస్తోంది. ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్-1) పరీక్షలనూ పూర్తి చేశారు. అయినా నేటికీ బోధకుల పోస్టులు ఖాళీలతోనే కేజీబీవీలను నడిపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..జిల్లా వ్యాప్తంగా 14 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా విద్యాలయాల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన సాగుతోంది. 6 నుంచి 10వ తరగతి వరకు 3,106 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 765 మంది చదువుతున్నారు. మొత్తం 6-12వ తరగతి వరకు 3,871 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యాలయాల్లో వివిధ సబ్జెక్టుల బోధించే ఉపాధ్యాయుల పోస్టులు 49 ఖాళీగానే ఉన్నాయి. అసలే కొవిడ్ కాలంలో విద్యార్థులకు నష్టం జరిగిన విషయం విదితమే. కనీస సామర్థ్యాలు తగ్గినట్లు పలు సర్వేలూ వెల్లడించాయి. ఈ నేపథ్యంలో నెల తర్వాత తాపీగా గత ఏడాది పనిచేసిన బోధకుల్ని తీసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. నెలకు రూ.23 వేలు చొప్పున వేతనం చెల్లించి తాత్కాలిక పద్ధతిలో నియమించుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

రోజుల్లో భర్తీ చేస్తాం

జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీల వివరాలు తీసుకొని నివేదిక తయారు చేసి కలెక్టరేట్‌కు పంపాం. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే ఆయా విద్యాలయాల్లో బోధకుల్ని తక్షణమే భర్తీ చేస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

మరికొన్ని జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీలు ఇలా..అన్నపురెడ్డిపల్లి-1, భద్రాచలం-9, బూర్గంపాడు-9, చంద్రుగొండ-3, చర్ల-6, దుమ్ముగూడెం-2, గుండాల-6, జూలూరుపాడు-4, కరకగూడెం-2, ములకలపల్లి-3, పాల్వంచ-1, పినపాక-1, టేకులపల్లి-2.

# స్వచ్ఛందంపై విముఖత

ఖమ్మం : టీఎస్ఆర్టీసీలో యాజమాన్యం ఇటీవల తీసుకువచ్చిన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ(వీఆర్ఎస్)పై కార్మికులు, ఉద్యోగులు అంతగా ఆసక్తి చూపడం లేదు. అతి తక్కువ సంఖ్యలో కార్మికులు వీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. ఖమ్మం రీజియన్‌లో మొత్తం 256 మంది ఉద్యోగులు ఉండగా, వారిలో 20 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు తక్కువ సంఖ్యలో ఉన్నారు. జులై 31 వరకు వీఆర్ఎస్‌కు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని యాజమాన్యం కోరినప్పటికీ రీజియన్ వ్యాప్తంగా మొత్తం 23 మంది దరఖాస్తు చూపడం గమనార్హం. మిగిలిన వారు మాత్రం ఆ దిశగా ఆసక్తి చూపడం లేదు.

ప్యాకేజీపై నిరాసక్తి

ఆర్టీసీలో పనిచేస్తున్న వారు స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ఆసక్తి ఉన్నప్పటికీ యాజమాన్యం ఇస్తున్న ప్యాకేజీ కార్మికులు, ఉద్యోగులకు



ఎంతమాత్రం నచ్చలేదని తెలుస్తోంది. అందుకోసమే వారు వీఆర్ఎస్‌పై ఆసక్తి చూపడం లేదు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఇచ్చినట్లు ప్యాకేజీ ఇస్తారని భావించినా అలా జరగకపోవడంతో పెదవి విరుస్తున్నారు. గత పదిరోజులుగా రీజియన్ వ్యాప్తంగా ఆరు డిపోల్లో ఉద్యోగులు, కార్మికులు ఈ విషయంపైనే చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్యం సరిగాలేని వారు, 58ఏళ్లు నిండిన వారు వీఆర్ఎస్‌కు మొగ్గు చూపుతారని యాజమాన్యం ఆశించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉంది. కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్యాకేజీ సరిగా లేకపోవడంతో వారు ఉద్యోగ విరమణకు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఎస్‌కు అతితక్కువ మంది కార్మికులు, ఉద్యోగులు స్పందించారు. ఖమ్మం రీజియన్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కలను అధికారులు బస్‌భవన్‌కు పంపించారు. అయితే కొంతమంది కార్మిక సంఘాల నాయకులు సైతం ఉద్యోగులను అటువైపుగా ఆలోచన చేయకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు: 23

కండక్టర్లు: 5, డ్రైవర్లు: 7,

మెకానికల్: 8, ఇతరులు: 3

డిపోల వారీగా.. ఖమ్మం: 12,

మధిర: 4, సత్తుపల్లి: 3, భద్రాచలం: 1, మణుగూరు: 2, కొత్తగూడెం

# హరిత లక్ష్యం చేరేనా!

కోరుట్ల : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014లో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతంలో 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం'లో ఊరురా విస్తృతంగా మొక్కలను నాటించే కార్యక్రమం అమలు చేస్తుంది. ప్రస్తుత ఏడాది ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న 'తెలంగాణ హరితోత్సవం' ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఇప్పటికే నిర్దేశించింది. అదే రోజు 9వ విడత హరితహారం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. దీంతో జగిత్యాల జిల్లాలో 9వ విడత హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతుంది.

స్వల్ప లక్ష్యంతో సాధన

9వ విడత హరితహారం కార్యక్రమం ద్వారా ఊరురా, పంచాయతీ వాడల్లో, రోడ్ల కిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, రైతుల భూముల్లో, పొలం గట్లపై, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఉపాధిహామీ సిబ్బంది స్థలాలను ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో, ఇంటింటికీ పంపిణీ చేసేందుకు గ్రామపంచాయతీలోని నర్సరీల్లో నీడనిచ్చే, పండ్ల, పూల మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచారు. గతంలో ప్రతి గ్రామపంచాయతీకి 40వేల మొక్కలు నాటాలనే లక్ష్యంను జిల్లా అధికారులు నిర్దేశించేవారు. అధికారులు కేటాయించిన లక్ష్యం అందుకోవడం కష్టంగా మారేది. నామమాత్రంగా మొక్కలు నాటి కాగితాల మీద లెక్కలు చెప్పడంతో విమర్శలపాలయ్యేవారు. 2022-23 నుంచి గ్రామపంచాయతీలలో ఎన్ని మొక్కలు నాటాలనే లక్ష్యంను



ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ పాలకులకు అప్పగించారు. వారు డిసెంబర్‌లో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలో ఏరకమైన మొక్కలు ఎన్నినాటాలి, ఇళ్లలో ప్రజల భాగస్వామ్యంతో ఎలాంటి మొక్కలు నాటించవచ్చని నిర్ణయిస్తారు. గ్రామాల్లో ఇప్పటికే మొక్కలు నాటించే స్థలాలను గుర్తించారు. గ్రామపంచాయతీ పరిధిలోని పరిస్థితులను బట్టి స్వల్ప లక్ష్యం నిర్దేశించుకోవడంతో శతశాతం అమలు పరిచేందుకు ఉపాధిహామీ సిబ్బంది, పాలక యంత్రాంగం శ్రమిస్తున్నారు. ఈవిషయమై జిల్లా డీఆర్‌డీఏ పీడీ లక్ష్మినారాయణను సంప్రదించగా 19న హరితోత్సవం రోజునే జిల్లావ్యాప్తంగా హరితహారం కార్యక్రమం అమలు చేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. అదేరోజున అన్ని గ్రామాల్లో, ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వివరించారు. వర్షాలు కురిసే పరిస్థితులను బట్టి మొక్కలను నాటిస్తామని, అప్పటివరకు ఉపాధిహామీ సిబ్బంది కూలీలతో గుంతలను తవ్వి, మొక్కలను సరఫరా చేసి సిద్ధంగా ఉంచుతామన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన వెంటనే మొక్కలను పూర్తిస్థాయిలో నాటిస్తామని పేర్కొన్నారు.

# నిండా పచ్చదనం.. ప్రణాళికతోనే సాధ్యం

ముస్తాబాద్ : గ్రామాలను పచ్చదనంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. హరితహారంలో భాగంగా ఇంటింటా, ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టి మొక్కలను నాటారు. ఏటేటా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో పాటు పందిరిలా అల్లుకుని వాహన, పాదచారులకు చల్లని నీడనిస్తూనే చూపరులను ఆకట్టుకుని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

హరితహారం సత్ఫలితాలే ఇవి..

ముస్తాబాద్ మండలంలోని 22 గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వం హరితహారంలో భాగంగా అన్ని గ్రామాల్లో 2015 సంవత్సరం నుంచి హరితహారం కార్యక్రమం చేపట్టింది. ఇళ్ల ముందు, వీధుల్లో, ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటారు. నాడు నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. జూన్ మాసం ఆరంభమైనా ఎండలు మండుతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక వాహనాదారులు ప్రధాన రోడ్డుకిరువైపుల ఉన్న చెట్ల కింద వాహనాలు ఆపి కాసేపు సేద తీరుతున్నారు. ప్రధాన రోడ్డు సమీపంలోని రైతులు చెట్ల కిందకు వచ్చి అలసిపోయి కునుకు తీస్తున్నారు. మూడేళ్ల క్రితం చిప్పపల్లి ప్రధాన రోడ్డు వెంట నాటిన మొక్కలు ఏపుగా ఎదిగి వాహన, పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం నామాపూర్ వెళ్లే రోడ్డులో అరకిలో మీటర్ వరకు, నామాపూర్ నుంచి రాంరెడ్డిపల్లె వెళ్లే రోడ్డులో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పైన కొమ్మలు అల్లుకుపోయి రోడ్డుపై చల్లని పందిరిని తలపిస్తున్నాయి. పోత్గల్ నుంచి ఆవునూర్, గూడెం ప్రధాన రోడ్డు నుంచి ఆవునూర్, వెంకట్రావుపల్లె బస్టాండ్ నుంచి గ్రామశివారు వరకు చెట్లు ఏపుగా పెరిగాయి. వచ్చే హరితహారంలోనూ ఇలా దూరదృష్టితో సత్ఫలితాలు వచ్చేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

వేసవిలోనూ ఇక్కడ ఆహ్లాదమే..

నామాపూర్ గ్రామం నుంచి గూడెం బస్టాండ్ వెళ్లే రోడ్డుకిరువైపుల హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఎదిగాయి. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నా.. పందిరిలా అల్లుకుపోయిన చెట్లు పాదచారులకు, వాహనదారులకు చల్లని నీడతోపాటు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ముస్తాబాద్ మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట అడుగడుగునా పచ్చని చెట్లు దర్శనమిస్తుండడంతో దూరప్రాంతాలకు వెళ్లే వాహనదారులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.

మద్దికుంట రాములు, నామాపూర్

వర్షాలు పడగానే హరితహారం

గతంలో హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాం. అవి ఏపుగా పెరిగాయి. ప్రధాన రోడ్ల వెంట పచ్చందాలను తలపిస్తున్నాయి. మళ్లీ వర్షాలు ప్రారంభం కాగానే హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. గ్రామాన్ని బట్టి నర్సరీలలో మొక్కలను పెంచుతున్నాం. ప్రతీ ఇంటిముందు, ప్రధాన రోడ్ల వెంట, సముదాయాల వద్ద, కార్యాలయాల ఆవరణలో నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన చోట్ల మొక్కలను నాటి సంరక్షిస్తాం. ఆనంద్ మోహన్, ఏపీవో

# ఒక కుటుంబం.. ఒకే పోలింగ్ కేంద్రం



ఖమ్మం : ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో నమోదయ్యేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఈనెల 23 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. నవంబర్‌లో శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించింది. నగరాలు, పట్టణాల్లో బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వేర్వేరు కుటుంబాల వారు ఒకే ఇంటి నంబర్‌పై ఓటర్లుగా నమోదవుతున్నారు. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నంబర్‌ను ఇంటి నంబర్‌కు అదనంగా జోడించుకునే అవకాశముంది.

**23 వరకు బీఎల్‌ఓల సర్వే**

ప్రస్తుత ఓటర్ల జాబితా ఆధారంగా బీఎల్‌ఓలు ఈనెల 23 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఓటర్ల వివరాలు సేకరించి మరణించిన వారి పేర్లు తొలగిస్తారు. ఇల్లు మారిన వారి పోలింగ్ కేంద్రం, చిరునామా, ఇంటి నంబర్ మార్పులు, అక్షర దోషాల సవరణకు సూచనలిస్తారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా కొత్తగా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. బీఎల్‌ఓలు వచ్చే వరకు వేచిచూడాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో ఫారం-6 ద్వారా ఓటు నమోదు, ఫారం-7 ద్వారా ఓటు తొలగించేందుకు, ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. %https:///voters.eci.gov.in% వెబ్‌సైట్‌ను ఆశ్రయించవచ్చు. లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 5న ప్రకటించనున్న తుది ఓటర్ల జాబితాలో పేరుంటేనే రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం దక్కుతుంది.

ఇంటి నంబర్ తప్పనిసరి ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఇంటి నంబర్‌ను కచ్చితంగా ప్రస్తావించాలి. కుటుంబంలోని ఓటర్లంతా ఒకే ఇంటి నంబర్ ఇస్తే వారందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటేసేలా అధికారులు జాబితాను రూపొందిస్తారు. గతంలో కొన్ని కుటుంబాల్లో కొందరు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటేయాల్సి వచ్చేది. చాలామంది ఓటుహక్కు వినియోగానికి విముఖత చూపేవారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కుటుంబంలోని వారంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ప్రతి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనుంది.

# ధరల పతనంతో.. ఆయిల్‌పాం రైతుల్లో ఆందోళన



ఖమ్మం : ఇప్పటికే ఆయిల్‌పాం గెలల ధర పతనంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కేంద్రం తెచ్చిన మద్దతు ధర విధానం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది. అంతర్జాతీయంగా ముడిచమురు దిగుమతులు పెరిగి దేశీయ ఆయిల్ ధరల పతనంతో ఆ ప్రభావం పామాయిల్‌పై తీవ్రంగా పడింది. గెలల ధర గతేడాది జూన్‌లో రూ.23 వేలు ఉంటే ప్రస్తుతం సుమారు రూ.10 వేలు తగ్గి రూ.13,346 ఉంది. పెరిగిన ఎరువుల ధరలు, గెలల కోత, యాజమాన్యం, రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు కనీసం రూ.19 వేలు ధర ఉండాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్ఎంఈఓపీ ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చి 16న కేంద్రం ఆయిల్‌పాం గెలలకు మద్దతు ధర ప్రకటించింది. ఆ ప్రకారం టన్నుకు రూ.13,346 నిర్ణయించింది. అంతకు పెరిగినా, తగ్గినా ఇదే రేటు వర్తించేలా నిర్ణయించింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇస్తున్న గింజల నుంచి వచ్చే 10.5 శాతం ధర ఈ మద్దతు ధరకు కలవదు. ఈ లెక్కన రైతులకు తీవ్ర నష్టాలు తప్పవని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. అయితే కేంద్రం మరో మెలిక పెట్టింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఎన్ఎంఈఓపీ ద్వారా డీఓ నంబరు: 3-14/2021-ఓపీ(ఎస్‌బీ) తేదీ 16.03.2023 ప్రకారం ధరను నిర్ణయిస్తూ రాష్ట్రాలకు లేఖ పంపింది. ఆ ప్రకారం ఏ రాష్ట్రానికి ఆరాష్ట్రం ఎంఓయూ చేయాల్సి ఉంది. ఈ ఎంవోయూ కుదిరితే రైతులకు నష్టం వాటిల్లే అవకాశముంది.

విధానాన్ని పునఃసమీక్షించాలని వేడుకోలు

కేంద్రం కొత్త లెక్కల ప్రకారం 2021 నవంబరు 1 నుంచి 2028 అక్టోబరు 31వరకు రైతులకు ఇచ్చే 14.30 వాటా ప్రకారం ఇదే ధర అంటే రూ.13,346 వర్తిస్తుంది. 2028 నవంబరు 1నుంచి 2031 అక్టోబరు 31 వరకు 14.55 చొప్పున, 2031 నవంబరు నుంచి 2034 అక్టోబరు 31 వరకూ 14.80 చొప్పున, 2034 నవంబరు 1 నుంచి 2037 అక్టోబరు 31 వరకు 15.05 చొప్పున, 2037లో 15.30 చొప్పున చెల్లించాలని ఆదేశాలిచ్చింది. విశేషమేమంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం 19.22 ఫార్ములా (ఇందులో రైతులకు 75.25 శాతం: పరిశ్రమలకు 24.75 వాటా) అమలవుతోంది. ఈ లెక్కన కేంద్రం తెచ్చిన ధరలు మారాలంటే కనీసం 2034 వరకూ ఆగాల్సిందే. ఇది ప్రమాదకర ధోరణి అని, ఈ లెక్కన తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్‌పాం ధరలు పెరగాలంటే మరో పదేళ్లు ఆగాల్సిందేనా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విధానాన్ని పునఃసమీక్షించి కనీస మద్దతు ధరను రూ.19వేలుగా నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడకుండా రైతులతో సంప్రదించి ఎంఓయూ కుదర్చుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సామర్థ్య పరీక్షలు తుస్సు

కొత్తగూడెం : పాఠశాలలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యాసంస్థలు విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు.. తిరిగి ఇంటికి చేర్చేందుకు బస్సులు, మినీ వ్యాన్లను నడుపుతుంటాయి. ఆయా బస్సులకు ప్రతి సంవత్సరం మే 15వ తేదీలోగా సామర్థ్య(ఫిట్‌నెస్) పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ తర్వాతే ఆయా బస్సులు రోడ్డు మీదకు రావాలి. కానీ కొన్ని విద్యాలయాల యజమానులు ఈ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఉభయ జిల్లాల్లో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల రవాణా భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉభయ జిల్లాలో 568 బడి బస్సులున్నాయి. వీటిల్లో ఈనెల ఏడో తేదీ నాటికి 218 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయినట్లు రవాణా శాఖ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాజమాన్యాలు ఈ విషయంలో ఎంతో వెనుకబడ్డాయి. మొత్తం 260కి గాను కేవలం 20 బస్సులకే సామర్థ్య పరీక్షలు చేయించడం గమనార్హం. మరో వైపు రవాణా శాఖాధికారులు ఇప్పటికే ఆకస్మిక తనిఖీలు చేయడం ప్రారంభించారు. అనుమతులు, పత్రాల్లేని బస్సులపై చర్యలు తీసుకొనే అకాశాలున్నాయి. ప్రథమ చికిత్స పెట్టె, ఫైర్ సిలిండర్, హెడ్‌లైట్లు, టైర్లు, వైపర్, విద్యార్థులు కూర్చునే సీట్లు, పుస్తకాలు పెట్టుకునేందుకు అరలు, ముందు, వెనుక బ్రేకులు, రక్షణ రాడ్‌లు అందుబాటులో ఉంచడం, పూర్తిస్థాయిలో వాహనం కండిషన్‌లో ఉండేలా చూడటం యాజమాన్యాల బాధ్యతే.

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే..

బస్సుల జీవిత కాలం 15 సంవత్సరాలు. ఆ వ్యవధి దాటితే నిబంధనల ప్రకారం.. స్క్రాప్(పాత ఇనుము)గా పరిగణించి అనుమతులు రద్దు చేస్తారు. జీవితకాలం ఉన్న వాటికీ పరీక్షలు నిర్వహించి ఏడాది కాలానికి అనుమతి అందజేస్తారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రతీ వాహనాన్ని రవాణా కార్యాలయానికి తీసుకువచ్చి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. కొత్తగూడెం, ఖమ్మం డీటీవో కార్యాలయాల్లో సామర్థ్యం పరీక్షలు నిర్వహిస్తారు.

కొన్నింటికే.. పలు పాఠశాల యాజమాన్యాలు కొన్ని వాహనాలకు మాత్రమే పరీక్షలు నిర్వహించి ఎక్కువ సంఖ్యలో సామర్థ్యంలేని బస్సులను సైతం తిప్పుతున్నారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ఫిట్‌నెస్ పూర్తయిన బస్సులను చూపిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కష్టపడుతున్నారే తప్ప.. విద్యార్థుల రవాణా విషయంలో సరైన నిబంధనలు పాటించడంలేదనే వాదన తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. పలువురు పరిమితికి మించి విద్యార్థులను తరలించడం జరుగుతోంది. ప్రమాదం చోటు చేసుకున్నాక బాధపడేకంటే.. ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రమాదాలను నివారించవచ్చనే వాదన వినిపిస్తోంది. అధికారులు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం

పి.వేణు, డీటీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# రైలు కూతకు ఇంకెంత కాలం

సిరిసిల్ల : రైలు ప్రయాణం.. జిల్లా వాసుల చిరకాల వాంఛ.. దశాబ్దాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. మెదక్ జిల్లా మనోహరబాద్ నుంచి గజ్వేల్ మీదుగా దుద్దెడ వరకు రైల్వే ట్రాక్ పనులు పూర్తయ్యాయి. గజ్వేల్ వరకు గూడ్స్ రైలు రాకపోకలు సాగిస్తోంది. తర్వాతి దశ సిద్దిపేటలో చేపట్టాల్సిన పనులు మిగిలి ఉన్నాయి. ఇటీవల సిద్దిపేట శివారులో జరుగుతున్న పనులు మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. దుద్దెడ-సిద్దిపేట పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆగస్టులో సిద్దిపేటకు రైలు నడిచేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఇక దాని తర్వాత జిల్లా పరిధిలోనే పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికీ జిల్లాలో సర్వే పూర్తయిన చోట పరిహారం పంపిణీ దశలో ఉన్నాయి. ఆధ్యాత్మిక వారధిఈ రైల్వేలైను పరిధిలో మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోని 70 గ్రామాలు.. 15 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో కొమురవెల్లి మల్లన్న, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనృసింహస్వామి, వేములవాడ రాజన్న పుణ్యక్షేత్రాలు కలుపుతూ ఉంది. జిల్లాలో రైల్వేలైను పూర్తయితే ఇక్కడి నుంచి సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా దిల్లీ వెళ్లే మార్గానికి ఉమ్మడి జిల్లా వాసులకు మరోమార్గం అందుబాటులోకి వస్తుంది. ముంబాయి, షిర్డీ పట్టణాలకు ఈ రైలు మార్గం అనువుగా ఉంటుంది.

ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలను అనుసంధానం చేసే మనోహరా



బాద్-కొత్తపల్లి రైల్వేలైను నిర్మాణానికి రూ.1,160.47 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. 151.36 కిలోమీటర్లు రైల్వేలైనుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా భూసేకరణ, పరిహారం చెల్లింపులు కాగా కేంద్ర ప్రభుత్వం రైల్వేలైను నిర్మాణం చేస్తుంది. ఈ మార్గంలో ఇప్పటికే మనోహరాబాద్ నుంచి నాచారం, బేగంపేట, అప్పాయిపల్లి, గజ్వేల్, కొడగండ్ల మధ్య రైల్వేలైను పూర్తవడంతో పాటు ఆయా ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు సిద్ధమయ్యాయి.

గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు 32 కిలోమీటర్ల పరిధిలో సింగిల్ ట్రాక్ (ఒక లైను) నిర్మాణం జరుగుతోంది. సిద్దిపేటలో స్టేషన్ నిర్మాణం చివరి దశలో ఉంది. ఇక్కడికి ఒక కిలోమీటరు దూరంలో ట్రాక్ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే సిద్దిపేట స్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహిస్తారు. సిద్దిపేట స్టేషన్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా శివారులో గుర్రాలగొంది వద్ద మరో స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. సిద్దిపేట తర్వాత ఇక్కడి వరకు నిర్మాణం చేపట్టనున్నారు.

మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మొదటి దశ. గజ్వేల్- సిద్దిపేట రెండో దశ కాగా మూడో దశ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనులు జరగాల్సి ఉంది. రైల్వేలైను కోసం జిల్లాలో 946.20 ఎకరాలు అవసరమని గుర్తించారు. దీనిలో 356 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇటీవలే వేములవాడ మండలంలోని నిర్వాసితులకు పరిహారంపై తుది నివేదికను సిద్ధం చేశారు. బోయినపల్లిలో కొంతమేరకు పరిహారం పంపిణీ పెండింగ్‌లో ఉంది. సిద్దిపేట నుంచి తంగళ్లపల్లి వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. తంగళ్లపల్లి నుంచి రాజరాజేశ్వర జలాశయం బ్యాక్ వాటర్ మీదుగా వంతెన నిర్మాణం చేపట్టాలి. దీనికి నీటిపారుదలశాఖ అనుమతుల దశలో ఉంది.

భూ సేకరణ పూర్తయింది

రైల్వేలైను భూసేకరణ దాదాపుగా పూర్తయింది. వేములవాడ సమీపంలో రెండొందల ఎకరాల మేరకు సేకరించాల్సి ఉంది. పరిహారం విషయంలో రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆలస్యమవుతోంది. మిగతాచోట ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశాం. త్వరలోనే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేస్తాం. శ్రీనివాసరావు, ఆర్డీవో, సిరిసిల్ల

# ఆహ్లాదం.. నిర్వహణ అధ్వానం!

కోరుట్ల : జనానికి ఆహ్లాదం కోసం హుజూరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నాలుగేళ్ల క్రితం రూ.45 లక్షలతో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. విలువైన పూలమొక్కలు, గడ్డిజాతులు, రంగురంగుల కళాకృతులు, కుర్చీలు, నీటిని వెదజల్లే ఫౌంటేన్‌తో పార్కు ఆహ్లాదకర వాతావరణాన్ని పంచేది. చిన్నారులకు క్రీడా పరికరాలతో మంచి ఆటవిడుపుగా ఉండేది. 2020లో కొవిడ్ రావడంతో దాదాపు రెండేళ్లపాటు తెరవ లేదు. ఏడాదిగా తెరుస్తుండగా ఉదయం వేళలో కొందరు వ్యాయామం కోసం వస్తుండగా, సాయంత్రం నుంచి రాత్రి వరకు చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఆటలాడుతూ సేదతీరుతున్నారు. పార్కులో వ్యాయామ పరికరాలు, ఫౌంటెన్, చిన్నారులకు వివిధ రకాల క్రీడాపరికరాలు ఉన్నా వాటిలో చాలా వరకు నిర్వహణ లేకుండా



పోయాయి. పురపాలిక ఆధ్వర్యంలో పార్కు నిర్వహిస్తుండగా పారిశుధ్య నిర్వహణ సరిగా ఉండటం లేదు. తినుబండారాల కవర్లు, చెత్తాచెదారం పార్కులో ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగినా తొలగించేవారే లేరు. ఫౌంటేన్ సమీపంలో ఏర్పాటు చేసిన కొలనులో నీరు దుర్వాసన వస్తోంది. ఈ విషయమై ఛైర్‌పర్సన్ రాధికతో మాట్లాడగా పార్కును పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూస్తామని చెప్పారు. ఉదయం, సాయంత్రం పర్యవేక్షణ బాధ్యతలను కార్యాలయ సిబ్బందికి అప్పగిస్తామని, ఆటవస్తువులు, జిమ్, కొలను, ఫౌంటేన్ తదితర సామగ్రిని మరమ్మతు చేయిస్తామని తెలిపారు.

# విధుల్లో చేరని వీఆర్వోలు

నిర్మల్ : జిల్లాలో ఆయా శాఖలకు కేటాయించిన వీఆర్వోలెవరూ విధుల్లో చేరలేదు. ప్రభుత్వ ఆదేశాలతో లాటరీ పద్ధతిలో పాలనాధికారి సిక్తా పట్నాయక్ సోమవారం రాత్రి 110 మంది వీఆర్వోలను 24 శాఖలకు సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయమే వారిని రిలీవ్ చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చినా బదిలీ ఆర్డర్లు తీసుకునేందుకు వీఆర్వోలు రాలేదు. తాజాగా జారీ చేసిన జీవో 121 మేరకు వీఆర్వోలను సీనియారిటీని, విద్యార్హతలను పరిగణలోకి తీసుకోకుండా, ఆప్షన్లు ఇవ్వకుండా హడావుడిగా లాటరీ పద్ధతిలో ఆయా శాఖల్లో తమను సర్దుబాటు చేయడం పట్ల వీఆర్వోలు ఆందోళనలో ఉన్నారు. పదోన్నతులు, సర్వీసు అంశాలపై స్పష్టత కొరవడటంతో కొత్తగా కేటాయించిన శాఖల్లో చేరొద్దని నిర్ణయించారు. ఈ మేరకు పట్టణంలోని ఓ సంఘభవనంలో సమావేశమయ్యారు. అనంతరం తమకు న్యాయం చేయాలంటూ అదనపు పాలనాధికారి నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అంతా అయోమయం

రెవెన్యూ మినహా వీఆర్వోలను ఇతర శాఖలకు కేటాయించడం.. వీఆర్ఏలు విధులు బహిష్కరించి సమ్మెలో ఉండటంతో తహసీల్దార్



కార్యాలయాలు వెలవెలబోయాయి. ఆయా పనుల కోసం వచ్చిన వారంతా సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పనులు జరగక తిరుగుముఖం పట్టారు. గ్రామస్థాయిలో విచారణ జరిపే వ్యవస్థ లేకపోవడంతో ఆయా ధ్రువపత్రాల జారీ నిలిచిపోయింది. అంతటా అయోమయం నెలకొంది. వీరుచేయాల్సిన పనిభారమంతా ఆర్ఐల మీద నెట్టేయడంతో ఏ పని చేయాలో వారికి అంతుబట్టని అంశంగా తయారైంది. ఆయా శాఖలకు వీఆర్వోలను సర్దుబాటు చేయడంతో నిరుద్యోగులతో భర్తీ చేయాల్సిన జూనియర్ అసిస్టెంటు ఖాళీలు లేకుండాపోతాయనే ఆందోళన వ్యక్తం అయ్యింది.

జనం లేక వెలవెల

ఇది జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దారు కార్యాలయం. నిత్యం అర్జీదారులతో నిండుగా కనిపించే ఈ ప్రాంగణం మంగళవారం ఇలా వెలవెలబోయింది. వీఆర్వోలను ఇతర శాఖలకు బదిలీ చేయడం, వీఆర్ఏలు సమ్మెబాట పట్టడంతో పనులు చేసేవారు లేక ఈ పరిస్థితి నెలకొంది.

సమస్యల ని'వేదన'..!

విధుల్లో చేరని వీఆర్వోలు మంగళవారం అదనపు పాలనాధికారి నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వీసు సంబంధ అంశాలపై స్పష్టత ఇచ్చేలా ప్రభుత్వానికి తమ గోడును తెలపాలని విన్నవించారు. ఆయా అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేవరకు విధుల్లో చేరబోమని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌కి తెలిపారు.

# ఇక నుంచి పక్కా.. అసంపూర్తికి చికిత్స

నిర్మల్ : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించడంతోపాటు వివిధ అభివృద్ధి పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్నారు. అయితే పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టకపోవడం, కొన్ని అర్ధాంతరంగా ఆపివేయడం వంటి వాటితో పలుచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు, చేపట్టిన పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ వంట గది నిర్మల్ జిల్లా గ్రామీణ మండలం వెంగ్వాపేట్ ప్రాథమిక పాఠశాలలోనిది. అయిదారేళ్లుగా ఇదే దుస్థితి. అక్కడ ఉన్న ఓ చిన్నపాటి గదిలో ఇబ్బందుల మధ్య వండాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి చాలాచోట్ల ఉన్నాయి. మొత్తం 799 చోట్ల మంజూరు కాగా.. 133 నిర్మాణదశలో ఉండగా, 211 పూర్తయ్యాయి. కొద్దిపాటి పనులు చేస్తే వినియోగంలోకి వచ్చేవి 394 వరకు ఉన్నాయి. వీటితో పాటు 245 బడులలో మూత్రశాలలు, మరుగుదొడ్లు కట్టేందుకు ప్రభుత్వం మంజూరివ్వగా.. 51 నిర్మాణ దశలో, 67 పూర్తి దశకు, 24 మాత్రమే పూర్తయ్యాయి.

ఇదీ పరిస్థితి..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 66 మండలాల్లోని 1510 పంచాయతీల్లో 4.34 లక్షల జాబ్‌కార్డులు, 8.26 లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 777 కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. పథకంలో చెరువుల పూడికతీత, పంట క్షేత్రాలు చదును చేయడం, పంట కల్లాలు, విద్యాలయాల్లో వంటగదులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతలు వంటి తదితర 260 రకాలకు చెందిన పనులు చేస్తున్నారు. అయితే పలుచోట్ల ప్రారంభించినవి పూర్తి కాకుండానే మరోటి ప్రారంభిచడంతో అవి అందుబాటులోకి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గ్రామానికి 20 చొప్పున..ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని తీసుకొచ్చింది. కూలీల వివరాలను క్షేత్రస్థాయిలో చరవాణిలో ఫొటో తీసి వివరాలను నమోదు చేసి వారి లెక్క పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంది. దీంతో పాటు పంచాయతీకి 20 చొప్పున ఉపాధి పనులు చేపట్టేందుకు కేంద్రం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. ఎంపిక చేసి పూర్తయిన పనికి సంబంధించిన వివరాలను పూర్తిగా నమోదు చేసిన తర్వాతే మరో దానిని నమోదుచేసే అవకాశం కల్పించారు. ఈ నెల నుంచే అమలు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. నూతన మార్గదర్శకాలు అభివృద్ధికి దోహదం చేసేలా ఉన్నాయని, పనులు పక్కాగా సాగే అవకాశం ఉందని మరికొందరు అంటున్నారు.

వెంటనే చేపట్టేలా..విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి, నిర్మల్

ఉపాధి హామీలో నిర్వహిస్తున్న పనుల్లో ఎక్కడా జాప్యం జరుగకుండా వెంటవెంటనే నిర్వహించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పంచాయతీకి 20 చొప్పున పనులు చేయాలన్న మార్గదర్శకాలు ఇటీవల ప్రభుత్వం జారీ చేసింది. దానికనుగుణంగా చేపట్టబోయే వాటిపై పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించాం. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా, కూలీలకు ఆర్థిక చేయూతనందించేలా అన్ని విధాలా కార్యాచరణ సిద్ధం చేసి ముందుకెళ్తున్నాం.

# డిప్యూటేషన్ల పంచాయితీ




నిర్మల్ : జిల్లా పంచాయతీ శాఖలో పలువురు కార్యదర్శుల ఆకస్మిక బదిలీలు (డిప్యూటేషన్) వివాదాస్పదంగా మారాయి. నచ్చిన వారికి అనుకూలమైన చోట పోస్టింగ్‌లు ఇచ్చి నచ్చని వారికి స్థానచలనం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఓ అధికారి ఏకంగా పంచాయతీ కార్యదర్శితో వాట్సాప్ చాటింగ్ చేయడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడం వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ డిప్యూటేషన్లలో ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న ఉద్యోగి బంధువు సైతం ఉండటం, ఆయనకు జిల్లా కేంద్రానికి దగ్గరలో పోస్టింగ్ ఇవ్వడంతో చాలా కాలంగా బదిలీ కోసం ఎదురుచూస్తున్న తోటి కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా కేటాయింపు

జిల్లాలో 468 పంచాయతీల్లో అన్ని పంచాయతీలకు కార్యదర్శులున్నారు. అందులో రెగ్యులర్ కార్యదర్శులు 112 మంది, జూనియర్ పంచాయతీ సెక్రటరీలు 324 మంది, అవుట్ సోర్సింగ్ కింద 32 మంది పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది స్వస్థలాల నుంచి దూరప్రాంతాల్లో ఉన్న పంచాయతీలకు వెళ్లి పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నివాసముంటున్న దాదాపు పది మంది పంచాయతీ కార్యదర్శులు రోజూ 50 కిలోమీటర్ల దూరంలోని గాదిగూడ మండలానికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా పలుమార్లు జిల్లా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్నారు. తమను దగ్గరి పంచాయతీల్లో సర్దుబాటు చేయాలని విన్నవించుకున్నారు. ఇప్పటికీ వారిలో ఏ ఒక్కరిని సర్దుబాటు చేయలేదు.

విధులొకచోట.. వేతనం మరోచోట

జిల్లాలో ప్రస్తుతం ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను ఇలా డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేశారు. అంటే వారు పాత పంచాయతీ నుంచే జీతభత్యాలు పొందాల్సి ఉంటుంది. పని మాత్రం వేరే చోట చేయాలి. ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉన్నపుడు ఇలా డిప్యూటేషన్ ఎందుకు చేస్తున్నారనే అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారికంగా బదిలీ చేయాలంటే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంటుంది. దీంతో అధికారికి నచ్చిన వారికి మాత్రం డిప్యూటేషన్ పేరుతో సర్దుబాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విజ్ఞప్తి చేసుకుంటేనే డిప్యూటేషన్ చేశామని అధికారులంటున్నారు. అయితే జిల్లాలో చాలామంది దూరప్రాంతాల్లో పని చేస్తున్న కార్యదర్శులు చాలామంది ఇలా దరఖాస్తు చేసుకున్నా వారిని ఎందుకు బదిలీ చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలోని గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఓ కార్యదర్శి తనకు పట్టణానికి ఆనుకుని మావల పంచాయతీకి పోస్టింగ్ ఇవ్వాలని అధికారితో చేసిన వాట్సాప్ చాటింగ్ సారాంశం ఇది..

కార్యదర్శి : గుడ్‌మార్నింగ్ సర్. సర్ ప్లీజ్ నాకు ఆదిలాబాద్ అయినా, మావల అయినా ట్రాన్స్‌ఫర్ చేయండి కద ప్లీజ్

అధికారి : ఓకే విల్ సీ

కా : థాంక్యూ సర్

మరోరోజు..కా : గుడ్ మార్నింగ్ సర్. నాకు ఏ జీపీ ఇస్తున్నారు సర్. నాకు మావల జీపీ ఇవ్వండి సర్ ప్లీజ్. ఇంకా లోపల జీపీలు వద్దు. సదరు కార్యదర్శి మావల జీపీ కోరితే జిల్లా కేంద్రానికి 10 కి.మీ. దూరంలోని మరో పంచాయతీకి డిప్యూటేషన్ ఇచ్చారు. అయితే కార్యదర్శి బదిలీ కోరితే డిప్యూటేషన్ ఇచ్చారు. "పాత చోటు నుంచి ఇల్లు ఖాళీ చేసి వచ్చాం. కొత్త పంచాయతీకి ఎవరైనా కార్యదర్శి బదిలీపై వస్తే నా పరిస్థితి ఏంటి సార్ మళ్లీ పాత స్థానానికి పోలేను కదా" అంటే ఆ అధికారి 'నో ప్రాబ్లెం.. జాయిన్ ఇమీడియట్లీ' అని బదులు ఇచ్చారు.

మచ్చుకు కొన్ని

గతంలో ఓ పంచాయతీ కార్యదర్శి మరో మండలానికి బదిలీ చేయాలని కోరుతూ ఏకంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి నుంచి ఓ లేఖను తీసుకువచ్చారు. స్థానిక అధికారులు అదేమీ కుదరదని చెప్పేసి బదిలీని నిలిపివేశారు. మరో రాజకీయ నేత బంధువుకు మాత్రం నచ్చినచోట పోస్టింగ్ ఇచ్చి స్వామి భక్తిని చాటుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై గళమెత్తే ఓ కార్యదర్శిపై కక్షగట్టిన అధికారులు ఆయన సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా మెమోలు జారీ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఓ పంచాయతీ కార్యదర్శికి ఏడాది వయసు పాప ఉంది. పాప సంరక్షణకు ఇబ్బంది అవుతుందని, దూర ప్రాంతానికి పంపవద్దని వేడుకున్నా అధికారులు కనికరించలేదు.

జిల్లా కేంద్రంలో నివాసముంటున్న ఓ పంచాయతీ కార్యదర్శి రోజూ 55 కిలోమీటర్ల దూరంలోని పంచాయతీకి వెళ్లి విధులు నిర్వహిస్తారు. దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే..శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటేషన్ ఇచ్చాం. ఇందులో పనిష్మెంట్ ఏమీ లేదు. పాలనాధికారి ఉత్తర్వుల ప్రకారమే ప్రక్రియ అంతా జరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం, కొందరు పరస్పర అంగీకారంతో ఆయా కార్యదర్శులకు డిప్యూటేషన్ ఇచ్చాం. ఇందులో ఎలాంటి పైరవీలు, సిఫారసులు లేవు.

# వ్యసనాల దారిలో.. యువతరం!

ఆదిలాబాద్ : ఉట్నూరుకు చెందిన 30 ఏళ్లలోపున్న ఆరుగురు యువకులు వేరే జిల్లాకు చెందిన మరో ఇద్దరు మిత్రులను తమ ఊరికి పిలిపించుకున్నారు. ఓ లాడ్జిలో గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. సమాజంలో గుర్తింపు ఉన్న కుటుంబాలకు చెందిన వీరు చెడు వ్యసనాలకు బానిసై పడి కేసుల పాలవ్వడం వారి తల్లిదండ్రులను బాధించింది. ఇటీవల ఉట్నూరు మండలం కుమ్మరితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ప్రధాన కారణం ఓ యువకుడు స్పోర్ట్స్ బైక్‌ను తీసుకొని అతివేగంగా నడిపి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడమే. ఇలా ఉమ్మడి జిల్లాలో 70 శాతానికి పైగా యువత రహదారి ప్రమాదాల్లో బలైపోతున్నారు. నిర్మల్ జిల్లా తానూరు మండలం హంగిర్గాకు చెందిన మోహన్ అనే 25 ఏళ్ల యువకుడు పెళ్లి కావడంలేదని, సరైన ఉపాధి లేదని మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మానసిక ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా కొంతమంది ఎదుగుతున్న యువత తమ జీవితాలకు అర్ధాంతరంగానే ముగింపు పలుకుతున్నారు.

సమాజ అభివృద్ధి, దేశ పురోగతిలో యువత పాత్ర కీలకం. బలమే జీవనం.. బలహీనతే మరణమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని స్వామి వివేకానంద యువతకు పిలుపునిచ్చారు.

కానీ ప్రస్తుతం వివిధ కారణాలతో ఉమ్మడి జిల్లాలోని యువతలో క్రమశిక్షణ లోపిస్తోంది. విపరీతమైన మనస్తత్వం, కోపం, ద్వేషం ఒత్తిళ్లకు లోనవుతూ ఆత్మన్యూనతతో బాధపడుతూ చెడు వ్యసనాల దారిలో పయనిస్తున్నారు. దీని ప్రభావం వారితో పాటు వారి కుటుంబాల పైనా పడుతోంది.


వీటి ప్రాధాన్యతను తెలియజెప్పాలి..

వ్యక్తిత్వ వికాస నిర్మాణంలో కుటుంబంతో పాటు విద్యాలయాల పాత్ర ఎక్కువే. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ.. పిల్లలకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవాటు చేయాలి. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, మానవత్వ విలువలు పెంచేలా వారిలో ఆసక్తిని కలిగించాలి. పాపభీతి, దైవభక్తి వంటి మంచి అలవాట్లను తొలుత పెద్దలు ఆచరించి ఆపై పిల్లల్లో పెంచాలి. ఇటువంటి ప్రాధాన్య అంశాలను వారు గుర్తించాల్సిన అవసరం ఉంది.

ఒత్తిడిని గుర్తించండి..చాలామంది యువత ప్రేమ విఫలమైందని, పోటీ పరీక్షల్లో ర్యాంకు రాలేదని, అడిగిన వస్తువు కొనివ్వడం లేదని, చిన్నచితకా ఆరోగ్య సమస్య వచ్చిందని ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిర్లక్ష్యం, సరిగా తినకపోవడం, ఎవరితోనూ మాట్లాడకపోవడం, ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడటం వంటి లక్షణాలు కనిపిస్తే.. వారికి వెంటనే మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

మన అవసరాల కోసం వాహనం నడిపించడం తప్పుకాదు. అదే



సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, శిరస్త్రాణం ధరించడం, తాగకుండా నడిపించడం, సురక్షితంగా ఇంటికి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

వీటికి దూరంగా ఉండండి..

యుక్త వయసు వచ్చాక శారీరక, మానసిక మార్పులు సహజం. ఈ సందర్భంలో మనసును నియంత్రణలో పెట్టుకొని ఉన్నతంగా చదవాలి అనే భావన కలిగి ఉండాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

పఠనంతో ప్రయోజనం..

సెల్ రూపంలో అరచేతిలో సమస్త ప్రపంచం ఉన్న ప్రస్తుత సమాజంలో.. పక్కదారి పట్టించే విషయాల జోలికి వెళ్లకుండా దాని నుంచి మంచిని స్వీకరించండి. పుస్తకాలు, దిన, వార, పక్ష, మాసపత్రికలు పఠించడంతో మానసిక ప్రశాంతత పొందవచ్చు.

ఆరోగ్యంపై దృష్టి పెడితే..ప్రస్తుతం యువతలో శారీరక శ్రమ తగ్గిపోయింది. వ్యాయామం చేయడం, పరుగెత్తడం, యోగా సాధన వంటి అలవాట్లు లేకపోవడంతో చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం, లేదా యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి.

ఆటపాటలు

ఉరుకులు పరుగుల జనజీవన స్రవంతిలో యువత తీవ్రమైన ఒత్తిళ్లతో కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. బయటపడేందుకు ఇష్టమైన ఆటలు ఆడాలని, నచ్చిన సంగీతాన్ని వినాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిబంధనలు పాటిస్తేనే రక్షణ– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ ఆదిలాబాద్

మార్కెట్లో వస్తున్న కొత్త బైకులను ఇష్టానుసారంగా వేగంగా, నిబంధనలు అతిక్రమిస్తూ నడుపుతూ ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోవద్దు. చెడు అలవాట్లకు గురై తమ జీవితాలను కటకటాల పాలు చేసుకోవద్దు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి.

చదువే అన్నింటికీ పరిష్కారం– వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ

యువత ఉద్యోగం, ఉపాధి లేదని ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందివస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో ఎవరిపైన ఆధారపడకుండా తన కాళ్లపై నిలబడేందుకు సర్వశక్తిని దారపోయాలి. తల్లిదండ్రులకు భారం కాకుండా ఉన్న ఊరిలోనే ఉపాధిని ఆశించకుండా అవకాశం వస్తే ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడాలి. ప్రతి సమస్యకు చదువే పరిష్కారం చూపుతుంది.

# పేరుకుపోతున్నా.. పట్టింపు కరవు

ఆసిఫాబాద్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీల పన్ను వసూలుదే కీలకపాత్ర. ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్లకు సంబంధించి.. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 335 పంచాయతీల్లో ఏటా ఆస్తి పన్నులు వసూలు చేస్తారు. జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను లక్ష్యం రూ.4.92 కోట్లు కాగా రూ.4.57 కోట్లు వసూలయ్యాయని, పన్నేతర లక్ష్యం రూ.2.12 కోట్లు కాగా రూ.1.87 కోట్లు వసూలైనట్లు జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు. పన్ను, పన్నేతర కలిపి ఇంకా రూ.70 లక్షల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తుంది. నోటీసులతోనే సరిపెడుతున్నారు..లి ఇది వాంకిడి మండలం తహసీల్దార్ కార్యాలయం. దీనికి ఏడాదికి రూ.12,246 చొప్పున పన్ను వేశారు.



ఏటా చెల్లించకపోవడంతో బకాయిలు పెరిగి రూ.1.78 లక్షలకు చేరింది. వీటిపై నోటీసులు ఇవ్వడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పొంతన లేని లెక్కలు..జిల్లా కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి తీసుకున్న లెక్కల్లో పొంతన లేకుండా ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఆసిఫాబాద్ పంచాయతీ పన్ను లక్ష్యం రూ.1.64 కోట్లు, పన్నేతర రూ.91.13 లక్షలు కాగా వసూలు రూ.2.30 కోట్లు అయినట్లు డీపీవో కార్యాలయం అధికారులు చెబుతున్నారు. కానీ ఆసిఫాబాద్ పంచాయతీ నుంచి ఇచ్చిన సమాచారంలో మొత్తం లక్ష్యం రూ.1.03 కోట్లు కాగా వసూలు రూ.89.88 లక్షలు అయినట్లు అక్కడి అధికారులు చెప్పడం గమనార్హం.

ఏటికేడు పెరుగుతూ..జిల్లా కేంద్రంలో 16 ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్లకు సంబంధించి రూ.21.37 లక్షలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వారికి పంచాయతీ అధికారులు ఏటా నోటీసులు జారీ చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు. వాటిలో అత్యధికంగా ఆర్డీవో కార్యాలయ భవనాలకు సంబంధించి రూ.3.93 లక్షలు, అటవీశాఖకు సంబంధించి రూ.3.98 లక్షలు, వట్టివాగు కార్యాలయ భవనాలు రూ.3.13 లక్షలు, పీఆర్ ఈఈ కార్యాలయ భవనాలు రూ.1.48 లక్షల చొప్పున పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.లక్షలకు చేరినా నిర్లక్ష్యమే.. చిత్రంలో కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం. దీనికి ఏడాదికి రూ.27 వేల వంతున పన్ను వేశారు. కానీ ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో బకాయిలు రూ.2.22 లక్షలకు చేరాయి. వాంకిడి మండలంలో 14 ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలకు సంబంధించి రూ.తొమ్మిది లక్షల బకాయిలున్నాయి. వాటిలో అత్యధికంగా తహసీల్దార్ కార్యాలయం రూ.1.78 లక్షల బకాయి ఉంది. ఆసుపత్రి క్వార్టర్లు, ఐకేపీ కార్యాలయం బకాయిలు సైతం రూ.లక్ష దాటి ఉన్నాయి. మిగతావి రూ.10 వేల నుంచి రూ.88 వేల వరకు పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి. రెబ్బెనలో అయిదు ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.17 లక్షల పన్ను బకాయి పడ్డాయి. ఇలా దాదాపు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ఆస్తిపన్ను బకాయిలున్నాయి.

వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ– రమేశ్, ఇన్‌ఛార్జి డీపీవో

కొన్ని ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు పేరుకుపోతున్న విషయం వాస్తవమే. పెండింగ్‌లో ఉన్న కార్యాలయాలకు నోటీసులు జారీ చేసి వసూలు చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

అసలు రూ.25.16 లక్షలు వసూలైంది రూ.5 లక్షలే

జిల్లాలోని ఏకైక కాగజ్‌నగర్ పురపాలిక సంఘ పరిధిలోని 16 కార్యాలయాలకు గత ఆర్థిక సంవత్సరం పన్ను లక్ష్యం రూ.25.16 లక్షలు కాగా రూ.5 లక్షలే వసూలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పన్నుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నా.. పుర అధికారులు మాత్రం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు.

# జనం మేలెంచి.. జలం పనులు చేపట్టి..!

మంచిర్యాల : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న క్రమంలో.. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆజాదీ కా అమృత్ సరోవర్ పథకం' పనులు జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో 75 చెరువులు, కుంటలను ఎంపికచేసి ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించి బలోపేతం చేసే పనులు చేస్తున్నారు. ఈ నెల 15 నాటికి నిర్ధేశిత చెరువుల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా చేస్తున్నారు.

చెరువుల్లో చేసే పనులివే.. ప్రధానంగా చెరువుల్లోని అడుగు భాగంలో 10 వేల ఘనపు మీటర్ల మేరకు నీటిని నిల్వచేసేలా పనులు చేపట్టారు. ప్రమాణాల ప్రకారం చెరువుల్లో పేరుకుపోయిన ఒండ్రుమట్టిని పంట పొలాలకు తరలించి, కట్టలను బలోపేతం చేసేందుకు ఆ మట్టిని వినియోగిస్తారు. చెరువు కట్టలపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించి, కట్టలను ఉపయోగించుకునేలా పనులు చేస్తారు. దీనికోసం కూలీలు నిత్యం పనులు చేసి ఎంపిక చేసిన చెరువులు, కుంటలను బలోపేతం చేస్తారు. దీనికోసం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన చెరువులను గుర్తించి పనులు చేస్తున్నారు.

చక చకా తొలివిడత పనులు..

జిల్లాలో తొలి విడతగా చేపట్టిన 29 చెరువుల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 15 నాటికి పనులు పూర్తిచేసి రైతులకు అనుకూలంగా మార్చేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ పురోగతిని కేంద్ర ప్రభుత్వ సర్వర్‌కు అనుసంధానిస్తున్నారు. చెరువుల్లో మట్టిని తీసి, కట్టలను బలోపేతం చేయడం ద్వారా నీటి సామర్థ్యం పెరిగి చెరువుల దిగువన పంట పొలాల సాగు పెరుగుతుందనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో కనీసం ఒక చెరువునైనా ఆగస్టు 15 నాటికి పనులు పూర్తిచేసి అదే గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ సిటిజన్, ఎన్నారై, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులతో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తుది దశకు చేరుకున్న పనులు– శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాలజిల్లాలో ఆజాదీ కా అమృత్ సరోవర్ పథకం కింద గుర్తించిన చెరువుల్లో పనులు ముమ్మరంగా చేస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 29 చెరువుల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించుకున్నప్పటికీ వర్షాల కారణంగా 20 చెరువుల్లో పనులు పూర్తిచేసేలా క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్నాం. పంద్రాగస్టు రోజున పనులు పూర్తయిన చెరువుల్లో ఆయా గ్రామాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ సిటిజన్లతో జెండా పండగ వేడుకలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించి పనులు వేగంగా చేస్తున్నాం.

# పరిశ్రమ నిర్వహణ ఎలా..?

కామారెడ్డి : పరిశ్రమల నిర్వహణ ప్రతిబంధకంగా మారుతోంది. సమయానికి రాయితీలు దక్కకపోవడంతో నిర్వాహకులు నిరుత్సాహ పడుతున్నారు. కామారెడ్డి జిల్లాగా ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం కొంత మొత్తమే విడుదల చేసింది. సింహభాగం పెండింగులో ఉన్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. దరఖాస్తులు, అనుమతుల విషయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. టీఎస్‌ఐపాస్ విధానం ద్వారా అనేక పరిశ్రమలకు సులువుగా అనుమతులు ఇవ్వడంతో జిల్లాలో అనేక యూనిట్లు నెలకొల్పారు. ఇంత వరకు బాగానే ఉన్నా రాయితీ బకాయిలను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయకపోవడంతోనే సమస్య నెలకొంది. పరిశ్రమల నిర్వహణ కష్టంగా మారుతోందని యజమానులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.104.74 కోట్ల రాయితీ బకాయిలు విడుదల కావాల్సిఉంది. ఇందులో రాష్ట్రస్థాయి పరిశ్రమలకు రూ.87.07 కోట్లు, జిల్లాస్థాయి వాటికి రూ.17.67 కోట్లు రావాలి.



కొత్తవాటిపై ప్రభావంజిల్లాలో 2015–16 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సుమారు 200 యూనిట్లు నెలకొల్పారు. వీరికి పెట్టుబడి మూలధనం, విద్యుత్తు, పన్నుల మినహాయింపు, పావలావడ్డీ వంటి అంశాల్లో ప్రభుత్వం(ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే ఇవ్వాలి) నుంచి రాయితీలు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు ఆందోళన చెందు తున్నారు. దీని ప్రభావం కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలపై పడే అవకాశం ఉంది.

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం

రఘునాథ్, ఏడీ, పరిశ్రమల శాఖ


పరిశ్రమలకు రాయితీ బకాయిలు క్రమంగా విడుదలవుతున్నాయి. వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. రాష్ట్రస్థాయి పరిశ్రమలకు రాయితీలు ఎక్కువగా రావాల్సి ఉంది. జిల్లాస్థాయికి సంబంధించి 2020 సెప్టెంబరు వరకు క్లియర్ చేశాం.

# అనుమతులు ఉన్నవేవి?

కామారెడ్డి : పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి ఉన్నదేదో.. లేనిదేదో తెలియని పరిస్థితి విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. విద్యాశాఖ నియంత్రణ కొరవడటంతో సర్కారు నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ఆమోదం ఉన్నట్లు నిర్దేశించుకుంటున్నాయి. కొన్ని ఏకంగా సీబీఎస్‌ఈ (కేంద్ర విద్యామండలి) అనుమతులున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి.

నిబంధనలు ఇలా..ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తగా ప్రైవేటు పాఠశాలను ప్రారంభించాలనుకుంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మొదటగా ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యాసంస్థను తెరిచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తిస్థాయి అనుమతి పొందాలి. ప్రాథమికోన్నత స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి.. ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే ఆర్‌జేడీ ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి.

పాఠశాల విద్యా కమిషనర్ అనుమతితోనే ఉన్నత తరగతుల్లో అదనపు సెక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి. ఇందుకు



గాను సీబీఎస్‌ఈ బోర్డు అధికారులు ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. నిర్దేశిత పాఠశాలల్లో రెండుసార్లు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు అనుగుణంగా వసతులతో పాటు ఉపాధ్యాయులు ఉంటేన్టే అనుమతులు మంజూరు చేస్తారు.

వివరాలు బయట పెట్టరే..

జిల్లాకేంద్రంలో గత రెండేళ్లుగా పది – పదిహేను పాఠశాలలు ఎటువంటి అనుమతులు లేకుండానే తరగతులు ప్రారంభించాయి. తాజాగా రెండు ఐసీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. జిల్లావిద్యాశాఖ ఇటీవల పలు పాఠశాలలకు సీబీఎస్‌ఈ పర్మిషన్ లేవని గుర్తించింది. జిల్లావ్యాప్తంగా ఒక్కదానికే అనుమతి ఉన్నట్లు వెల్లడించింది. ఇదే తీరున రాష్ట్ర ప్రభుత్వ పర్మిషన్ లేనివాటి వివరాలు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా విద్యాశాఖ ప్రయత్నించక పోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి.

ఇబ్బందులు తప్పవు

సర్కారు అనుమతిలేని పాఠశాలల్లో విద్యార్థులు చేరితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్‌ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతిలేని వాటిల్లో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగా పేర్కొంటారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

గుర్తించి మూసివేస్తాం

రాజు, జిల్లా విద్యాధికారి

జిల్లాలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలను గుర్తిస్తున్నాం. నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నాం. కామారెడ్డిలో ఇటీవలే ప్రారంభించిన బడికి నోటీసు జారీ చేయడంతో ఓపెనింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మండల, డివిజన్, గ్రామాల్లో పర్మిషన్ లేకుండా నడిపిస్తున్నవాటిని గుర్తించి మూసివేస్తాం.

# ఆసుపత్రుల్లో వసతులు భేష్



జగిత్యాల : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేటుకు దీటుగా వసతులు కల్పిస్తూ నాణ్యమైన సేవలు అందిస్తుండడంతో జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది. పల్లె దవాఖానాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తూ సదుపాయాలు ఉండడంతో కేంద్ర బృందాలు పర్యటించి సేవలను పరిశీలించి ప్రశంసిస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్ర ఆసుపత్రితోపాటు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఆరోగ్య ఉపకేంద్రం ఎన్‌క్వాస్ జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి.

గుర్తింపు పొందాయి ఇలా..

జిల్లాలో మల్లాపూర్, మేడిపల్లి, జగిత్యాల పట్టణంలోని మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ధర్మపురి, తదితర ఆసుపత్రులు ఇప్పటికే ఎన్‌క్వాస్ గుర్తింపు పొందగా తాజాగా గత ఏప్రిల్, మే మాసాల్లో జిల్లాలోని కథలాపూర్, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మెట్‌పల్లి మండలం ఆత్మకూరు జగిత్యాల జిల్లా కేంద్ర ఆసుపత్రులను జాతీయ బృందాలు క్షేత్ర స్థాయిలో పలు విభాగాల్లో అందిస్తున్న సేవలు, రికార్డులు పరిశీలించారు. జాతీయ స్థాయి ప్రమాణాల నివేదికలను కేంద్రానికి పంపించారు. దీంతో ఈనెల 4న కేంద్ర ఆరోగ్యశాఖ జాతీయ స్థాయి క్వాలిటీ ఆస్యూరెన్స్(ఎన్‌క్వాస్) గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిప్రకారం ప్రాంతీయ ఆసుపత్రులకు ఏటా రూ.10 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.3లక్షలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు రూ.1.75 లక్షల చొప్పున మూడేళ్ల పాటు అందిస్తారు. మూడేళ్ల తర్వాత మళ్లీ కేంద్ర బృందాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటాయి.

అధికారుల ప్రత్యేక చొరవ

ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, వసతులు కల్పించడానికి జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఆసుపత్రులలో జాతీయస్థాయిలో నిర్వహించే 14 కార్యక్రమాల అమలు తీరును జిల్లా ప్రోగ్రాం అధికారులు, పర్యవేక్షకులు నిరంతరం ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని అమలు చేస్తుండడంతో జాతీయ స్థాయి గుర్తింపు సాధ్యమవుతోంది. మూడేళ్ల పాటు మంజూరు చేసే ఈ నిధుల నుంచి 75 శాతం ఆసుపత్రి అభివృద్ధికి 25 శాతం సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించనున్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

జిల్లాలోని ఆసుపత్రులకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం. జాతీయ స్థాయి గుర్తింపు పొందేందుకు ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపడుతున్నాం. వైద్య సేవల్లో జగిత్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువస్తాం. అందరి సహకారంతోనే జాతీయ స్థాయి గుర్తింపు సాధ్యమైంది. డాక్టర్ పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో

# పురంలో కొలను.. కలేనా..!



సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఈత కొలనులు ఏర్పాటు చేయడం లేదు. ఫలితంగా పట్టణ ప్రజలు ఈత నేర్చుకోలేకపోతున్నారు. పురవాసుల సౌకర్యార్థం ప్రతి పురపాలికలో అధికారులు కొలనులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా దృష్టిసారించే వారు కరవయ్యారు. దీంతో ఔత్సాహికులు ప్రైవేటు కొలనులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో గల 19 పురపాలికల్లో ఎక్కడా మున్సిపాలిటీకి చెందిన ఈత కొలను ఒక్కటీ లేకపోవడం పాలకులు, అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం.ఇదీ పరిస్థితి.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఒక్క నందికొండ పురపాలికలోనే ఈత కొలను ఉంది. దీన్ని పర్యాటక సంస్థ నిర్వహిస్తోంది. మిగతా పురపాలికల్లో ఎక్కడా నిర్మాణానికి నోచుకోలేదు. పట్టణాల్లో రోజురోజుకూ జనాభా పెరుగుతోంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు ఈత కొలనులు ఏర్పాటు చేసి శిక్షణ రూపేణా డబ్బులు వసూలు చేస్తున్నారు. చెరువుల్లో లోతు ఎక్కువ, తక్కువగా ఉండటంతో అంచనా వేయలేక బురదలో ఇరుక్కొని ఏటా ఎంతో మంది మరణిస్తున్నారు. అందుకే తల్లిదండ్రులు డబ్బులు చెల్లించి ప్రైవేటు కొలనులకు పిల్లలను పంపించి ఈత నేర్పిస్తున్నారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో పలువురు తల్లిదండ్రులు రూ.వందలు వెచ్చించి తమ పిల్లలకు ఈత నేర్పించారు.నిబంధనలు ఉల్లంఘన.. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా గల పురపాలికల్లో 45 వరకు ప్రైవేటు ఈత కొలనులు ఉన్నాయి. వాటిని తనిఖీ చేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది. నీళ్లు శుభ్రంగా ఉన్నాయా.. తరచూ మారుస్తున్నారా.. రసాయనాల మోతాదును ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలి. నీటిని ఎక్కడి నుంచి తెస్తున్నారు.. రక్షణ ఏర్పాట్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా.. తదితర విషయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ, అటు వైపు దృష్టిసారించే వారే లేరు. ప్రస్తుతం ప్రైవేటు కొలనుల వద్ద వందలాది మంది రోజూ ఈత నేర్చుకుంటున్నారు. మరికొందరు వ్యాయామం నిమిత్తం సాధన చేస్తున్నారు. అధికారులెవరూ తనిఖీలకు రావడం లేదని నిర్వాహకులు కనీస వసతులు కల్పించడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రమాణాలు ఇలా..

ఈత కొలను పొడవు, వెడల్పు విషయంలో నిబంధనలు ఉంటాయి. వీటి ఆధారంగానే ఎంతమందిని అనుమతించాలనేది నిర్ణయించాలి. చిన్న పిల్లల కోసం లోతు తక్కువ ఉండేలా నిర్మించాలి. నీటి శుద్ధికి సంబంధించి ప్లాంట్లను కోనేరు పక్కనే నెలకొల్పాలి. ఇలాంటివి లేకుండా నిర్వాహకులు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారు. శిక్షకుడితోపాటు లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలి. తోడుగా కుటుంబ సభ్యుల పర్యవేక్షణ అవసరం. ఇలాంటి ప్రమాణాలు పాటించడం లేదు. 'తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని ప్రైవేటు ఈత కొలనులపై చర్యలు తీసుకుంటామ'ని ఆయా మున్సిపల్ అధికారులు తెలిపారు.

# పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్!

ఆలేరు : ప్రభుత్వం విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరం (2023–2024) నుంచి ఉచితంగా రాత పుస్తకాలు (నోట్ బుక్స్) పంపిణీ చేయనుంది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ గురుకుల, అర్బన్ గురుకుల పాఠశాలలు, కస్తూర్బాలలో చదివే విద్యార్థులందరికీ అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాకు 11.84 లక్షలుఉమ్మడి జిల్లాలో 279 ప్రాథమికోన్నత పాఠశాలలు, 617 ఉన్నత పాఠశాలల ఉన్నాయి. మరో నాలుగు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, 49 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో చదివే విద్యార్థులకు మొత్తం 11,84,048 రాతపుస్తకాలు అందనున్నాయి. వీరందరికీ 200 పేజీలతో కూడినవి పంపిణీ కానున్నాయి. 6, 7 తరగతుల విద్యార్థులకు 6 చొప్పున, 8వ తరగతికి ఏడు, 9, 10 విద్యార్థులకు 14, ప్రభుత్వ గురుకుల కళాశాలల్లో 11, 12 రెగ్యులర్ కోర్సులు చదువుతున్న వారికి 12, వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న వారికి 10 చొప్పున అందజేస్తారు. 6, 7 తరగతుల విద్యార్థులకు మాత్రం సింగిల్ రూల్, గీతలు లేని(ప్లేన్)వి అందజేయనుండగా మిగతా తరగతుల వారికి ప్లేన్ రాత పుస్తకాలు అందజేస్తారు. వచ్చే విద్యా సంవత్సరం(2024–2025) నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

విద్యా దినోత్సవం రోజున

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లాలో ఈ నెల 3న బడిబాట ప్రారంభమైంది. దాదాపు 80 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు మండల వనరుల కేంద్రాలకు చేరాయి. మరో రెండు, మూడు రోజుల్లో ఏకరూప దుస్తులు పాఠశాలలకు అందనున్నాయి. ఈ నెల 20న పాఠశాలల్లో విద్యా దినోత్సవం నిర్వహించనుండగా ఇదే రోజున విద్యార్థులకు ఉచిత రాతపుస్తకాలు అందించనున్నారు.సర్కార్ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ షురూ అయింది. పాఠశాలలు ఈ నెల 12న తిరిగి ప్రారంభం కానున్నాయి. అదే రోజు విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాల పుస్తకాలు అందించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మురం చేస్తున్నారు. ఈ సారి సరఫరా అయిన



పుస్తకాల ప్రింటింగ్ నాణ్యత బాగుండటంతో పాటు పుస్తకం కవర్ పేజీకి లామినేట్ ఉండటం గమనార్హం.

పంపిణీ ఇలా...ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో 3,264 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 3,66,395 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మూడు జిల్లాలకు 25,86,250 పాఠ్యపుస్తకాలు సరఫరా జరగాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 12,17,290 పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇంకా 13,68,960 పుస్తకాలు రావాల్సి ఉంది. వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు ఆయా పాఠశాలలకు పంపిస్తున్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఇంకా లక్ష్యం మేరకు పుస్తకాలు సరఫరా జరగకపోవడం గమనార్హం. సరఫరా జరిగిన పుస్తకాల్లో ఏ పుస్తకాలు రాలేదో వాటిపై అధికారులు సమీక్ష చేస్తున్నారు. రాని పుస్తకాలపై సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు.పుస్తకాల పంపిణీ విషయమై ఇన్‌ఛార్జి డీఈవో ప్రశాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. పాఠశాలలు తెరిచే లోగా అన్ని పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తామన్నారు. రాని పుస్తకాల వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదిస్తున్నామని చెప్పారు.

# పడకల కొరత తీరేనా?

బోధన్ : గతేడాది రెండు వారాలు కురిసిన వానలకు 2002లో నిర్మించిన బోధన్ జిల్లా ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం ప్రమాదకరంగా మారింది. పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అప్రమత్తమైన సిబ్బంది కాన్పుల గదిని మైనర్ ఆపరేషన్ థియేటర్‌లోకి మార్చి, సాధారణ వార్డులను బాలింతలకు కేటాయించడంతో ప్రమాదం తప్పింది. దీంతో సాధారణ రోగులకు పడకల కొరత ఏర్పడి ఒకే దానిపై ఇద్దరిని సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసారి సమస్య తలెత్తకుండా టీఎస్‌ఎంఐడీసీ ఆధ్వర్యంలో రూ.77 లక్షలతో స్లాబ్ మరమ్మతులు చేపట్టారు. సకాలంలో పనులు పూర్తి చేస్తే సీజనల్ వ్యాధుల కాలానికి కొరతను అధిగమించవచ్చు.

తీవ్ర ఇబ్బందులు..120 పడకలు అందుబాటులో ఉండగా.. ప్రసూతి విభాగం మూసివేయడంతో 30 పడకల సామర్థ్యం తగ్గిపోయింది. ప్రసూతి కేసులకు 30 పడకలు కేటాయించి, సాధారణ రోగులకు 60 వరకు వినియోగిస్తున్నారు. ప్రధానంగా డయాలసిస్, నర్సింగ్ స్కూల్, ఇతర సేవల సంఖ్య పెరగడంతో గదుల కొరత ఏర్పడింది.



దీంతో ఆర్‌ఎంవో నివాస భవనం ఉపయోగిస్తున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో రోగుల సంఖ్య పెరిగితే పడకల కొరతతో రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతారని ప్రజలు వాపోతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి


ఆసుపత్రిలో గరిష్ఠంగా 800 నుంచి 1000 మధ్య ఓపీ, 70–100 వరకు ఐపీ నమోదవుతుంది. నెలకు 150 – 250 మధ్య ప్రసవాలు అవుతాయి. భవనంలోని ఇతర విభాగాల్లోనూ వాన కురిస్తే ఉరవడం సమస్యగా మారింది. గతేడాది విద్యుదాఘాతంతో కొన్ని విభాగాల్లో సరఫరా నిలిచిపోయి ఇబ్బంది ఏర్పడింది. జిల్లా హోదా దక్కిన ఈ ఆసుపత్రిలో పడకల సామర్థ్యం 250కి పెంచి, నూతన భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు కొనసాగుతున్నాయిడాక్టర్ శివశంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ఆసుపత్రిలో ప్రసూతి విభాగంలోనే గతేడాది సమస్య తలెత్తింది. రూ.77 లక్షలతో మరమ్మతులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

# ఆన్‌లైన్‌లో స్టాంపుల విక్రయాలు

నిజామాబాద్ : స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను నియంత్రించడా నికి ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. బహిరంగ మార్కెట్‌లో స్టాంపు వెండర్లు ఇకపై నేరుగా విక్రయించడానికి వీలులేదు. ఈ మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ 20 రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్జాలంలో వివరాలు నమోదు చేసిన తర్వాతే వాటిని విక్రయించాల్సి ఉంటుంది.

నూతన విధానం ఇలా గతంలో పలు రకాల అక్రమాలు జరుగుతు న్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఉభయ జిల్లాల్లో రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి 103 మంది స్టాంపు వెండర్ల(పాత విధానంలో)కు అనుమతులున్నాయి. అంతర్జాలంలో స్టాంపులు, బాండ్లు విక్రయించడానికి ముందు జిల్లా రిజిస్ట్రార్ నుంచి అనుమతి తీసుకోవాలి. అన్ని వివరాలతో దరఖాస్తు సమర్పించాలి.



పాతవారిలో ఇప్పటి వరకు 84 మంది దరఖాస్తులు పంపించారు. మిగతావారిలో కొందరివి తిరస్కరణకు గురైనట్లు తెలుస్తోంది.

గతంలో ఇలా..స్టాంపులను నేరుగా విక్రయించే సమయంలో పలువు రు పాత తేదీలు వేసి అక్రమాలకు పాల్పడేవారు. వ్యవసాయ భూము లు, స్థిరాస్తి వ్యాపార కార్యకలాపాల్లో తలదూర్చి తామే ముందుగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు చేసేవారు. వీలునామాలు, ఇతర వ్యవహారాలు నడిచేవి. ఈ మోసాలను నియంత్రించడానికే ప్రభుత్వం నూతన పద్ధతిని ప్రవేశపెట్టింది.

ఇదీ పరిస్థితి

ఉభయ జిల్లాల్లో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్మూర్‌లో 7, బాన్సువాడలో 6, భీమ్‌గల్‌లో 4, బిచ్కుందలో 5, బోధన్‌లో 14, దోమకొండలో 3, కామారెడ్డిలో 10, ఎల్లారెడ్డిలో 6, నిజామాబాద్ రూరల్‌లో 4, ఆర్‌వో నిజామాబాద్‌లో 25 మంది స్టాంపు వెండర్లు ఉన్నారు. వీరందరికీ పంపిణీ చేసే స్టాంపులు, బాండ్లపై ఉన్న నంబర్లను అంతర్జాలంలో నమోదు చేసి రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే వినియోగదారులకు విక్రయించాల్సి ఉంటుంది.

త్వరలో పూర్తిగా అందుబాటులోకిదాసరి ఫణీందర్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ఈ పద్ధతి కర్ణాటకలో ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రారంభ దశలో ఉంది. దశల వారీగా అమలు చేస్తాం. మరో 15 రోజుల్లో పూర్తిగా ఆన్‌లైన్ లోనే విక్రయించాల్సి ఉంటుంది.




దిల్లీ: కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దుపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీతా నర్రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ సందర్భంగా సునీత స్వయంగా వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ సేకరించిన సాక్ష్యాలు, అనేక అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇదే కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. "సీబీఐ దర్యాప్తునకు అవినాష్‌రెడ్డి ఏమాత్రం సహకరించడం లేదు. ఏప్రిల్ 24 తర్వాత 3 సార్లు నోటీసులిచ్చినా విచారణకు ఆయన హాజరుకాలేదు. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు తల్లి అనారోగ్యాన్ని సాకుగా చూపారు. అరెస్ట్ చేసేందుకు సీబీఐ అధికారులు వెళ్లినా ఎంపీ మద్దతుదారులు వారిని అడ్డుకున్నారు. సాక్షులను ఎంపీ అదే పనిగా బెదిరిస్తూ.. ఇతర నిందితులతో కలిసి వారిని ప్రభావితం చేస్తున్నారు. అవినాష్‌కు ఏపీ ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తోంది. ఆయనకు అధికార పార్టీలోని కీలక వ్యక్తుల మద్దతు ఉంది. సీబీఐ అధికారులపై అవినాష్ తప్పుడు ఫిర్యాదులు చేశారు.. వారిపై ప్రైవేట్ కేసులు నమోదు చేయించారు.

వివేకా హత్య గురించి సీఎం జగన్‌కు ముందే తెలిసింది" అని సునీత కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సునీత వాదనల అనంతరం తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈనెల 19కి వాయిదా వేసింది.

# జగనన్న ఆణిముత్యాలు...

## టెన్త్‌లో 1,250 మంది.. ఇంటర్‌లో 1,585 మంది

### రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20న సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సత్కారం



అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 2023 సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 1,250 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల్లో గ్రూపునకు ఒకరు చొప్పున 1,585 మందిని 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద ప్రతిభ అవార్డులతో సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం స్థాయిల్లో విడివిడిగా జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తారు. విద్యార్థులు తల్లిదండ్రులను శాలువాలతో, ఆ పాఠశాలల హెడ్‌మాస్టర్లను శాలువ, మొమెంటోతో సత్కరిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురిని సత్కరించనున్నారు. అంతకు ముందు ఈ నెల 17న జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు ఆధ్వర్యంలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఏడు ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలో నాలుగు గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కరు చొప్పున నలుగురిని సత్కరించనున్నారు.

ఈ నెల 15న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో ఎమ్మెల్యేల అధ్యక్షతన పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో ప్రతి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కరు చొప్పున నలుగురిని సత్కరించనున్నారు.

# ఉద్యోగులు బాగుండాలి.. చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం: సీఎం జగన్



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉద్యోగ సంఘాలు భేటీ అయ్యాయి. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగ సంఘాలు సీఎం జగన్‌తో సమావేశమయ్యారు. ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో కేబినెట్ నిర్ణయాలు, జీపీఎస్‌పై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే డెలివరీ మెకానిజం బాగుంటుందని, ప్రజలు సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగుల్ని సంతోషంగా ఉంచడానికి ప్రతి కార్యక్రమం మనసా, వాచా కర్మేణా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాజకీయ కారణాలతో ఎవరైనా ఏదైనా చెప్పినా వాటిని విశ్వసించనవసరం లేదని సూచించారు. ఉద్యోగులు బాగుండాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను వదిలేయకుండా.. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం చూపించాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకూ మంచి జరగాలి, రాష్ట్ర ప్రభుత్వానికీ మంచి జరగాలని ఆలోచన చేశామన్నారు. జీపీఎస్ కోసం రెండు సంవత్సరాలు కసరత్తు చేశామని సీఎం జగన్ వివరించారు. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణలోకి తీసుకుని డీఆర్‌లు జీపీఎస్‌లో ఇస్తున్నామని పేర్కొన్నారు. జీపీఎస్ అన్నది దేశానికే రోల్ మోడల్ అవుతుందన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల జీవన ప్రమాణాలను కాపాడినట్టు అవుతుందన్నారు. ఉద్యోగులకు సంబంధించి కేబినెట్ నిర్ణయాలన్నీ కూడా 60 రోజుల్లోగా అమల్లోకి రావాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఎక్కడా జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, డైలీ వేజెస్ కేటగిరీ ఉద్యోగులను కూడా ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు.




ముంబయి/కచ్: అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపోర్‌జాయ్ తుపాను అతితీవ్ర రూపం ధరించి తీరం వైపు దూసుకొస్తోంది. గురువారం ఇది గుజరాత్‌లోని కచ్ జిల్లా జఖౌవద్ద తీరాన్ని తాకనుంది. దీంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర యంత్రాంగాలు ముందస్తు సహాయక చర్యలు మొదలుపెట్టాయి. సముద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కచ్, ద్వారక ప్రాంతాల్లో దాదాపు 12వేల మందిని మరో చోటుకు తీసుకెళున్నారు. ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే జూన్ 15 వరకు గుజరాత్‌లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

**రైళ్ల రాకపోకలకు అంతరాయం..** తుపాను ఎఫెక్ట్‌తో పశ్చిమ రైల్వే పరిధిలో వందకు పైగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇప్పటివరకు 67 రైళ్లను అధికారులు రద్దు చేయగా.. మరో 56 రైళ్ల ప్రయాణాన్ని కుదించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ముంబయిలో ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు కూడా ఆటంకం వాటిల్లుతోంది. అటు కాండ్లా పోర్టులో షిప్పింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్** తుపాను ముప్పు నేపథ్యంలో కేంద్రం కూడా అప్రమత్తమైంది. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోన్లో మాట్లాడారు. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**జుహూ బీచ్‌లో ఇద్దరు మృతి..** అటు బిపోర్‌జాయ్ ప్రభావంతో ముంబయిలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సముద్ర తీరం వద్ద గస్తీ చేపట్టారు. అయితే, అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా నిన్న సాయంత్రం జుహూ బీచ్‌లో నలుగురు యువకులు సముద్రంలోకి వెళ్లారు. దీంతో అలల ఉద్ధృతికి వారు గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చేపట్టగా.. ఇద్దరు యువకుల మృతదేహాలను వెలికితీశారు. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు. అటు గుజరాత్‌లోనూ ముగ్గురు మృతిచెందారు. తుపాను ప్రభావంతో బలమైన గాలులు వీస్తుండటంతో ఇప్పటికే అనేక చెట్లు నేలకూలాయి. రాజ్‌కోట్‌లో బైక్‌పై దంపతులు వెళ్తుండగా.. చెట్టు కూలింది. ఈ ఘటనలో భార్య మరణించగా.. భర్త తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం బిపోర్‌జాయ్ తుపాను పోరుబందర్‌కు పశ్చిమ-నైరుతి దిశలో 300 కి.మీలు, ద్వారకకు నైరుతి దిశలో 290 కి.మీలు, జఖౌ పోర్టుకు దక్షిణ-నైరుతి దిశలో 340కి.మీలు దూరంలో ఉంది. జూన్ 15 సాయంత్రం ఈ తుపాను జఖౌ పోర్టు సమీపంలో తీరం దాటే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

# పవన్ వ్యాఖ్యలతో ఆసక్తికరంగా ఏపీ రాజకీయాలు




అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. వచ్చే డిసెంబర్‌లోనే ఏపీ, తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వస్తాయని అన్నారు. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై యువత ముందుకు వస్తున్నారని, తెలంగాణలో అన్ని నియోజకవర్గాల్లో బాధ్యతలు అప్పగించామన్నారు. యూత్ వింగ్‌తో ప్రారంభించి ఇక్కడివరకు వచ్చామన్నారు. అయితే ప్రజల అభిమానం సంపాదించుకోవడం కష్టమని, ప్రతి ఒక్కరూ ఐడెంటిటీని కాపాడుకోవాలన్నారు. భవిష్యత్తులో జనసేన పార్టీ చాలా బలమైన పార్టీగా ఎదుగుతుందన్నారు. తాను ఆశామాషిగా రాజకీయం చేయడానికి రాలేదని అన్న ఆయన.. సిద్ధాంతం కోసం పనిచేస్తున్నానన్నారు. జనసేనాని పవక్ కల్యాణ్ దూకుడు పెంచారు. తెలుగు రాష్ట్రాల్లో కార్యకలాపాలు విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణలో కూడా పార్టీ కార్యకలాపాలు విస్తరించాలని నేతలకు సూచిస్తున్నారు. తెలంగాణలో ఏ పార్టీతో పొత్తు ఉండదని ఒంటరిగా ఎన్నికలకు సిద్ధమవ్వాలని నేతలకు సూచించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడలో ప్రజానీకానికి జనసేన అండగా నిలవాలని పవన్ సూచించారు. తెలంగాణలో సయితం జనసేన బలమైన శక్తిగా మారుతుందన్నారు. ఉనికిని కాపాడుకుంటూ బలమైన భావజాలానికి కట్టుబడి ఉంటే మంచి వాటంతట అదే వస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు.

# కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి ఉషాశ్రీచరణ్‌కు బిగ్ షాక్



అనంతపురం: జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి ఉషాశ్రీ చరణ్‌కు బిగ్ షాక్ తగిలింది. నియోజకవర్గంలో మంత్రి తీరును అసమ్మతి వర్గనేతల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మంత్రి వ్యవహార శైలితో విసిగిపోయిన అసమ్మతి నేతలు ఈరోజు (మంగళవారం) ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎంపీ తలారి రంగయ్య సన్నిహితుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి వ్యవసాయ క్షేత్రంలో అసమ్మతి వర్గ నేతలు సమావేశం ఏర్పాటు చేశారు.

స్థానిక ప్రజాప్రతినిధులను మంత్రి ఉషాశ్రీ చరణ్ పట్టించుకోవడంలేదని నేతలు మండిపడుతున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరైన విజయోత్సవ సభలోనూ ఎంపీపీలు, జడ్పీటీసీలకు తీవ్ర అవమానం జరిగిందంటూ అసమ్మతి వర్గ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "అయ్యా జగన్ మోహన్ రెడ్డి.. ఆర్థికంగా నష్టపోయినా పర్లేదు.. మా ఆత్మభిమానాన్ని తాకట్టు పెట్టవద్దు. నాన్ లోకల్ వద్దు.. లోకల్ వ్యక్తులకే టికెట్ ఇవ్వండి'' అంటే మొరపెట్టుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా మంత్రి తీరును సొంత పార్టీ నేతలే వ్యతిరేకిస్తున్న పరిస్థితి. వైసీపీ నేతలపైనే బెదిరింపులు, కేసులు పెట్టిస్తున్నారని వారు ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి ఉష శ్రీ చరణ్ తీరును నిరసిస్తూ వైసీపీ అధిష్టానానికి బలమైన సంకేతాలు పంపేందుకు అసమ్మతి వర్గం సమావేశం నిర్వహించింది. దీనిపై అధిష్టానం ఏమేరకు స్పందింస్తూ చూడాలి మరి.

# ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవాల్సిన దుస్థితి మాకు లేదు..




విశాఖ: ఎన్నికల సందర్భంగా రాజకీయ వేట ఊపు అందుకుందని.. నాలుగేళ్ల తర్వాత ఏపీలో సభ పెట్టి, అమిత్ షా మాట్లాడారని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ఏపీ రాష్ట్రానికి చేసిన అనేక అంశాలను ప్రస్తావించారన్నారు. రాష్ట్రంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై అమిత్ షా మాట్లాడారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అరాచకాలు , అక్రమాలు గురించి మాట్లాడితే వైసీపీ నేతలు ఎందుకు ఉలికిపడుతున్నారని ప్రశ్నించారు. పరిపాలన పేరుతో అక్రమాలు చేశారని దుయ్యబట్టారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవాల్సిన దుస్థితి తమకు లేదని, బీజేపీ ఎవరికీ అండగా ఉండదని జీవీఎల్ స్పష్టం చేశారు. బీజేపీ సానుకూలంగా ఉందనే భ్రమ రాజకీయాలు చేయడం, ముఖ్యమంత్రి మానుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు కూడా డ్రామా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. చాలామంది మంత్రులు ఏం చేశారంటూ ఆయన ప్రశ్నించారు. తాము ఏం చేశామో పుస్తకాల్లో వేశామని, దమ్ముంటే చదువుకొని, బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. వాస్తవాలు చెప్పే ధైర్యముంటే జ్యుడీషియల్ ఎంక్వయిరీ వెయ్యాలన్నారు. విశాఖలో భూదందాలపై వేసిన సీట్లు ఏమయ్యాయన్నారు. భూ అక్రమార్కులను ప్రభుత్వం ఎందుకు కాపాడుతోంది?.. వారిని కూర్చోబెట్టి సెటిల్‌మెంట్లు చేసుకుందా?.. అని ప్రశ్నించారు. జాతీయ రహదారులపై రూ. 3 లక్షల కోట్లు ఖర్చు చేశామని జీవీఎల్ నరసింహారావు చెప్పారు.

# ఒకే పథకాన్ని ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?..జగన్‌పై నక్కా ఆనంద్ ఫైర్



గుంటూరు: పల్నాడు జిల్లాలో నిన్న(సోమవారం) సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా కానుక ప్రారంభించారని.. కానీ ఒక పథకాన్ని ఎన్ని సార్లు ప్రారంభిస్తారో జగన్ చెప్పాలని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పథకం ప్రారంభం పేరుతో స్వంత మీడియాకు కోట్లు దోచిపెడుతున్నారని ఆరోపించారు. పేదింటి పిల్లలకు ఉన్నత విద్య అందకుండా జగన్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. మున్సిపల్ స్కూల్స్‌లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టింది చంద్రబాబని.. అప్పుడు మాతృ భాషకు మంగళం అంటూ సాక్షిలో గోల చేశారని గుర్తుచేశారు. విదేశీ విద్యా పథకం ఆపి వేసింది జగన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. నాడు - నేడు పేరుతో వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బైజూస్ కంటెంట్ పేరిట కమిషన్‌లు దండుకున్నారన్నారు. ఉపాధ్యాయులపై వత్తిడి పెంచి కారుణ్య మరణాలకు కారణమయ్యారని మండిపడ్డారు. కరోనా సమయంలో మద్యం దుకాణాల ఎదుట ఉపాధ్యాయులకు డ్యూటీలు వేసింది జగన్ కాదా అంటూ నిలదీశారు. రాష్ట్రంలో 8 వేల స్కూల్స్ మూసివేసి పేదలకు విద్య దూరం చేశారన్నారు. ఓటమి భయంతోనే జగన్ ఏది పడితే అది మాట్లాడుతున్నారని నక్కా ఆనంద బాబు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు టీడీపీ సీనియర్ నేత కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి పట్ల నక్కా ఆనంద బాబు సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు.

# మంత్రి ఆర్కే రోజాకు ఏమైంది? చెన్నై అపోలో ఆసుపత్రిలో జాయిన్ అయ్యారెందుకు?



రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ.. తరచూ వార్తల్లో నిలిచే ఏపీ మంత్రి ఆర్కే రోజా అనారోగ్యం బారిన పడ్డారు. చెన్నై అపోలోలో ఆమె జాయిన్ అయ్యారు. ఇంతకూ మంత్రి రోజాకు ఏమైంది? ఏ ఆరోగ్య సమస్య ఆమెను అంతలా ఇబ్బందికి గురి చేస్తోందన్న విషయంలోకి వెళితే.. ఆమె వెన్నుముక.. కాలు సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నట్లుగా చెబుతున్నారు. గతంలోనూ ఇదే సమస్య తీవ్రం కావటంతో ఆమె ఇంటి వద్దే ఉన్న పరిస్థితి. గతంలో ఒకసారి ఆమె చెన్నై అపోలో ఆసుపత్రిలో దీనికి సంబంధించిన సర్జరీ కూడా చేయించుకున్నారు. అయినప్పటికీ.. ఆ నొప్పి తగ్గకపోవటం.. చికాకు పెట్టటంతో మళ్లీ ఆమె ఆసుపత్రిలో చేరాల్సిన దుస్థితి. ఈ నెల రెండున పుత్తూరులో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరు కావాల్సి ఉంది. కానీ.. విపరీతమైన కాలు నొప్పి కారణంగా ఆమె హాజరు కాలేదు. అంతేకాదు.. ఇటీవల తాడేపల్లిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశానికి ఆర్కే రోజా గైర్హాజరు అయ్యారు. కాలు నొప్పి తీవ్రంగా ఉండటంతో ఇంటి వద్దే ఫిజియోథెరపీ చేయించుకునేవారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటం.. కాలు వాపు పెరిగి పెద్దది కావటంతో.. ఆమె కూర్చోలేని దుస్థితి. దీంతో.. ఆమె శుక్రవారం రాత్రి అపోలో లో జాయిన్ అయ్యారు. ప్రస్తుతానికి ఆమె పరిస్థితిలో మార్పు లేదని.. మరో రెండు.. మూడు రోజుల ట్రీట్ మెంట్ అవసరమని చెబుతున్నారు. కాలు వాచిపోవటంతో.. ఆమె కూర్చోలేని పరిస్థితి ఉందంటున్నారు. రోజా అనారోగ్యంపై ఆమె అభిమానులు ఆందోళన చెందుతున్నారు.




# సొంత పార్టీ ఎంపీపీ కంటతడి

రౌతులపూడి: వైకాపా ఎమ్మెల్యే తనతో పాటు తన భర్తపై దాడి చేశారని అదే పార్టీకి చెందిన మహిళా ఎంపీపీ ఆరోపించారు. ఈ మేరకు కాకినాడ జిల్లా రౌతులపూడి ఎంపీపీ రాజ్యలక్ష్మి ఓ వీడియో విడుదల చేశారు. ఇ ఎమ్మెల్యే పూర్ణచంద్ర అనుచరులే దాడి చేశారంటూ వీడియోలో ఎంపీపీ పేర్కొన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని చెప్పారు. తమకు న్యాయం చేయాలంటూ కంటతడి పెట్టారు.

## శాకుంతలం కంటే మత్తుగా స్టన్నింగ్ లుక్

స్టార్ హీరోయిన్ సమంత వరుస సినిమాల్లో నటిస్తూ ప్రస్తుతం చాలా బిజీగా గడుపుతున్నారు. ఓ వైపు ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందుతూనే షూటింగ్ లో పాల్గొంది. కొన్నాళ్లు బ్రేక్ తీస్కొని.. తన ఆరోగ్యాన్ని బాగు చేసుకుంది. ఇక అప్పటి నుంచి శాకుంతలం సినిమా ప్రమోషన్ పనులతో బిజీగా మారిపోయింది. ఎప్పటికప్పుడు ఇంటర్వ్యూలు ఇస్తూ... తెగ సందడి చేసింది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా సోషల్ మీడియా వేదికగా కూడా ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత తన ఇన్ స్టా గ్రామ్ వేదికగా ఓ ఫొటో షేర్ చేసింది. అందులో సమంత అచ్చం మత్స్య కన్యలా కనిపిస్తోంది. అందుకు కారణం ఆమె వేసుకున్న ఔట్ ఫిట్ యే. మత్స్యకన్య లా లుక్కిచ్చే బ్లాక్ కలర్ ఔట్



ఫిట్ లో అదిరిపోయింది. పైన బ్లౌజ్ కింద బ్లాక్ కలర్ మిడ్డీ వేసుకుంది. పైనుంచి కిందకు వచ్చే సిరికి కుషించుకుపోయినట్లు కనిపించే ఈ డ్రెస్సులో సామ్ చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. అలాగే బ్లాక్ కలర్ నెయిల్ పాలీష్ బ్లాక్ హీల్స్ వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. మెడలో పాము లాగా ఉన్న ఓ సిల్వర్ జ్యువెల్లరీ చేతికి పాములా చుట్టుకొని ఉన్న రెండు వరుసల బ్రేస్ లేట్ పెట్టుకుంది. ఇయర్ రింగ్స్ కూడా ఇలాంటివే పెట్టుకుంది. ఇందులో సామ్ నడుము అందాలతో పాటు ఒంపుసొంపులు చక్కగా కనిపిస్తున్నాయి. నడుమైతే నయాగారా ఫాల్స్ లా మెలికలు తిరిగి కనిపిస్తోంది. పైన కొప్పు పెట్టుకున్న సామ్.. కొంచెం జుట్టును ముందుకు వేసుకొని అదిరిపోయే లుక్కులో దర్శనం ఇచ్చింది. సామ్ పోస్ట్ చేసిన ఈ ఫొటోలు చూసిన అభిమానులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయావు చాలా అందంగా ఉన్నావు రోజురోజుకూ నీ అందం పెరుగుతోందంటూ చెబుతున్నారు. ప్రస్తుతం సామ్ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె వేసుకున్న జ్యువెల్లరీ మరింత ట్రెండ్ అవుతోంది. సమంత హీరోయిన్ గా నటించిన తాజా చిత్రం శాకుంతలం ఏప్రిల్ 14వ తేదీన విడుదల అయింది. టాలీవుడ్ దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రం డిజాస్టర్ గా నిలిచింది.

## అమితాబ్ తో రొమాన్స్.. ఆ హీరోయిన్ కి వార్నింగ్ ఇచ్చిన ఖుష్బూ..!

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ ఖుష్బూ గురించి అందరికీ తెలిసిందే. ఉన్నది ఉన్నట్టుగా ముక్కుసూటిగా మాట్లాడే ఖుష్బూ హీరోయిన్ గా అప్పటి ప్రేక్షకులను అలరించగా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. తమిళ్ సినిమాలే కాదు తెలుగులో కూడా ఆమె వరుస సినిమాలు చేస్తున్నారు. సినిమాలే కాదు జబర్దస్త్ షోలో పార్ట్ టైం జడ్జ్ గా ఉంటున్నారు. ప్రస్తుతం జబర్దస్త్ జడ్జిగా ఇంద్రజ కృష్ణ భగవాన్ ఉంటున్నారు. వీరిలో ఏ ఒక్కరు మిస్సైనా ఖుష్బూ అక్కడ ప్రత్యక్షమవుతుంది. లేటెస్ట్ గా గోపీచంద్ హీరోగా వస్తున్న రామబాణం సినిమాలో కీలక పాత్రలో నటించారు ఖుష్బూ. ఈ క్రమంలో లేటెస్ట్ గా ఓ స్పెషల్ చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె హీరోయిన్ టబుకి వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని చెప్పుకొచ్చారు ఖుష్బూ. అమితాబ్ అంటే



ఎంతో ఇష్టమని చెప్పిన ఖుష్బూ చినీకం సినిమాలో టబు అమితాబ్ తో కలిసి రొమాన్స్ చేయడం తట్టుకోలేకపోయానని అన్నారు. చిన్నప్పుడు అమితాబ్ తో కలిసి నటించాను పెద్దయ్యాక కుదరలేదు. అయితే తనకు రాని ఆ ఛాన్స్ టబు దక్కించుకున్నందుకు ఆమెకు ఫోన్ చేసి మరీ తిట్టిందట. అమితాబ్ తో రొమాన్స్ చేస్తే తాను చేయాలి నువ్వెందుకు చేశావ్.. ఆయనతో రొమాన్స్ చేసే హక్కు అర్హత తనకే ఉన్నాయని చెప్పిందట. అలా అమితాబ్ పై తనకు ఉన్న ఇష్టాన్ని వెల్లడించింది ఖుష్బూ. చిరంజీవి బాలకృష్ణతో కూడా కలిసి నటించే అవకాశం కూడా చూస్తున్న అంటూ చెప్పారు. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూడాలి అలాంటి ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నా అన్నారు ఖుష్బూ.. తెలుగులో ఎలాగు సినిమాలు చేస్తున్నా కాబట్టి త్వరలోనే అలాంటి ఛాన్స్ అందుకుంటానని నమ్మకం ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ తో అజ్ఞాతవాసి సినిమాలో నటించిన ఖుష్బూ ఆ సినిమా ఎందుకు ప్రేక్షకులకు నచ్చలేదో తనకు అర్థం కాలేదని అన్నారు. బహుశా పవన్ మదర్ గా తనని యాస్పెక్ట్ చేయలేదని అన్నారు. మా మధ్య మ్యూజిక్ మిస్ అయ్యి ఉండొచ్చని అన్నారు.





## బీచ్ లో అందాలు ఆరబోసిన ఆండ్రియా



కందా నాల్ ముదల్ అనే తమిళ చిత్రంతో సినిమా రంగంలో 2005 సంవత్సరంలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ఆండ్రియా జర్మియా. ఈ అమ్మడు తమిళంతో పాటు తెలుగు.. మలయాళం భాషల్లో కూడా నటించి మంచి గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా ఈ అమ్మడు ఏదో ఒక మార్గంలో వినోదాన్ని అందిస్తూనే ఉంది. తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించని ఈ అమ్మడు ప్రస్తుతం కూడా తమిళంలో రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఇంత బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్ గా సందడి చేస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అయ్యాయి. పొట్టి షార్ట్ లో నడుము అందం చూపిస్తూ బీచ్ లో అందాలు ఆరబోసిన ఈ అమ్మడి యొక్క ఫోటోలు వైరల్ అవుతున్నాయి. షార్ట్ లో ఈ అమ్మడు థైస్ ను చూపిస్తూ చేసిన ఎక్స్ పోజింగ్ గతంలో పలు సందర్భాల్లో వైరల్ అయ్యాయి. ఇప్పుడు అదే తరహా లో ఈ ఫోటోలు కూడా చూపరులను అలరిస్తున్నాయి. తెలుగు లో తడాఖా సినిమాలో నటించిన ఈ అమ్మడు ఆ తర్వాత పలు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. తెలుగు లో ఈమె సునీల్ కు జోడీగా నటించడం వల్లే ఇతర హీరోల సినిమాల్లో ఆఫర్లు రాలేదు అనేది కొందరి అభిప్రాయం. తెలుగు లో ఆఫర్లు రాకున్నా కూడా ఈ అమ్మడు ఇలాంటి అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో అన్ని భాషల ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది.

## పంథ్ కి పోటీగా జడేజా.. ఊర్వశి నామస్మరణం!





హేట్ స్టోరి 4 బ్యూటీ ఊర్వశి రౌతేలా అందాలకు క్లీన్ బౌల్డ్ కానిది ఎవరు? ముఖ్యంగా టీమిండియా క్రికెటర్లు ఇప్పటికే ఒక్కొక్కరుగా స్టంప్ అవుట్ అయిపోతున్నారు. ఇటీవల ఊర్వశి లవర్ అంటూ రిషబ్ పంత్ పేరు ప్రముఖంగా వినిపించింది. అతడు ఊర్వశి పిలుపు కోసం ఐదు నక్షత్రాల హొటల్ లాంజ్ లో గంటల కొద్దీ సమయం వెచ్చించాడని కథనాలొచ్చాయి. అనంతరం ఊర్వశి ప్రకటనతో పంథ్ గందరగోళంలో పడ్డాడు. అయితే అభిమానులు మాత్రం ఈ జంట ఎంతో బావుంటుందని కితాబిచ్చేశారు. ఆ తర్వాత మరో యువక్రికెటర్ నసీమ్ షా కూడా ఊర్వశి అందచందాలకు క్లీన్ బౌల్డ్ అయిపోయాడు. ఇంకా ఊర్వశి జాబితాలో పలువురి పేర్లు చేరుతూనే ఉన్నాయి. క్రికెటర్లకు ఊర్వశి పేరును లింకప్ చేయడంతో సోషల్ మీడియాలో తరచుగా చర్చనీయాంశమైంది. తాజాగా ఊర్వశి అందాలకు పడిపోయిన వారి జాబితాలోకి మరో క్రికెటర్ చేరిపోయాడు. టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక న్యూస్ పోర్టల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశిపై తన అభిమానాన్ని దాచుకోలేకపోయాడు. అతడి వ్యాఖ్యలు అప్పటి నుండి సోషల్ మీడియాల్లో వైరల్ గా మారాయి. బాలీవుడ్ నటీమణుల్లో ఎవరు సెక్సీ? అని హోస్ట్ అడిగినప్పుడు.. జడేజా వెంటనే ఊర్వశి రౌతేలా పేరును ప్రస్తావించాడు. ఈ ప్రకటన ఊర్వశికి క్రికెటర్లలో పెరుగుతున్న క్రేజ్ ను మరింత పెంచింది. రిషబ్ పంత్ వర్సెస్ ఊర్వశి రౌతేలా వివాదం ఇప్పటికీ ముగిసిపోలేదు. పంథ్ ప్రమాదం తర్వాత ఆసుపత్రిలో చేరినప్పటికీ 5 జనవరి 2023న ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్ కి ఊర్వశి చేరుకున్నప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి.

అక్కడ పంత్ గాయానికి చికిత్స పొందుతుండగా తాను ఎందుకు చేరుకుంది? అంటూ ప్రశ్న తలెత్తింది. రౌతేలా దానిపై ఎలాంటి నిర్దిష్ట వివరాలను ప్రస్తావించకపోయినా.. క్రికెటర్ కోసమే ఆస్పత్రికి వచ్చిందన సోషల్ మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఊర్వశి వ్యవహారంపై పంథ్ అభిమానులు మాత్రం సీరియస్ గా స్పందిస్తున్నారు. వరుసగా యువక్రికెటర్లు ఊర్వశి వల్లో పడిపోవడం కొంత కంగారు పెట్టే వ్యవహారమే.

## పవన్ తో డేట్ కి రెడీ.. మామ్ ఫ్యానిజంపై కుమార్తె..!

స్టార్లను పిచ్చిగా అభిమానించడం కేవలం సామాన్య ప్రజల వరకే పరిమితం కాదు. సినీపరిశ్రమలో సెలబ్రిటీలుగా ఉన్నవారికి కూడా అంతే పిచ్చి. ఒకవేళ డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో అయితే మీకు ఓకే? అని ప్రశ్నించినా దానికి నిర్మొహమాటంగా తమ ఫేవరెట్ హీరో గురించి ఓపెనవ్వడమే కాదు.. డేట్ కి వెళ్లేందుకు సిద్ధమేనని చెప్పేందుకు వెనకాడరు. గత కొన్నేళ్లుగా కుమార్తె సుప్రీతతో కలిసి సోషల్ మీడియా ఫోటోషూట్లు వీడియో షూట్లతో చెలరేగుతున్న సహాయనటి సురేఖావాణి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కి వీరాభిమాని అన్న సంగతి ఎవరికీ తెలియదు. తాజా ఇంటర్వ్యూలో మామ్ అండ్ డాటర్ పవర్ స్టార్ పై ఉన్న అభిమానం గురించి ప్రస్థావించారు.



ఒకవేళ మీ అమ్మ గారు డేట్ కి వెళ్లాల్సి వస్తే ఏ హీరోతో వెళతారు? అని ప్రశ్నించగా సుప్రీత దానికి సమాధానమిచ్చారు. నిరభ్యంతరంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అంటే అమ్మకు అభిమానం. ఆయనతో డేట్ కి వెళ్లేందుకు అభ్యంతరం లేదు.. కింగ్ నాగార్జున అన్నా అంతే అభిమానం.. అని మమ్మీ మనసులో మాటను వెల్లడించింది. దానిని సురేఖావాణి తనవైన హావభావాలతో కన్ఫామ్ చేసారు. వంద ముద్దులు పెట్టాల్సి వస్తే ఏ హీరోకి? అని ప్రశ్నించగానే పవన్ కల్యాణ్ అంటూ చెప్పారు సురేఖ. డేటింగ్ అంటే ఒక వ్యక్తి కోసం కొంత విలువైన సమయం వెచ్చించడం.. అభిరుచులను షేర్ చేసుకోవడం.. అంతవరకే ఇమాజినేట్ చేయాలి. అంతకుమించి డేటింగ్ పై నానార్థాలు తీయకూడదు. తాము అభిమానించే తారలతో డేట్ కి వెళ్లడం ఫోటోలు లేదా సెల్ఫీలు దిగడం సర్వసాధారణమైన ప్రక్రియ. జనరేషన్ గ్యాప్ తో దీనిని అర్థం చేసుకునే విధానం కూడా మారిపోతోంది. పవన్ కల్యాణ్ – నాగార్జున సురేఖావాణి ఫేవరెట్ హీరోలు. అందుకే వీళ్లతో డేటింగుకి ఓకే అన్నమాట! ఇక కుమార్తెను కథానాయికగా తీర్చిదిద్దేందుకు సురేఖావాణి ప్రయత్నిస్తున్నారని కథనాలొస్తున్నాయి.


## గ్లామర్ డోస్ బాగా పెంచిన అర్జున్ రెడ్డి బ్యూటీ

అర్జున్ రెడ్డి చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ షాలిని పాండే మొదటి సినిమా తోనే బ్లాక్ బస్టర్ సక్సెస్ ని దక్కించుకుంది. ఇలాంటి ప్రియురాలు కావాలని ప్రతి ఒక్క కుర్రాడు అనుకునే విధంగా ఆ సినిమాలో షాలిని పాండే నటించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా ఆకట్టుకున్నా కూడా అదృష్టం సరిగా లేక పోవడంతో ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. అర్జున్ రెడ్డి పాత్రలో నటించిన విజయ్ దేవరకొండ టాలీవుడ్ స్టార్ అవ్వగా.. ఆయన ప్రియురాలి పాత్రలో నటించిన షాలిని పాండే మాత్రం సక్సెస్ లు లేకపోవడంతో



కొన్ని సినిమాలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో చిన్నా చితకా సినిమాలు చేస్తున్న షాలిని పాండే మరో వైపు భారీ ఎత్తున సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అందరిని సర్ ప్రైజ్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందాల ఆరబోత ఫొటోలు షాకింగ్ గా ఉన్నాయి.

మిర్రర్ ముందు నిల్చుని క్లీ వేజ్ షో చేస్తూ అందాల విందు చేస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో షాలిని పాండే అందాల ఆరబోత కామన్ అయ్యింది. తాజాగా ఈ ఫొటోలను చూస్తూ ఉంటే ఈ మధ్య కాలంలో అర్జున్ రెడ్డి బ్యూటీ అందాల ఆరబోత మరింత ఎక్కువ అయ్యిందనే టాక్ వినిపిస్తుంది.




# సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శం: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళా లోకానికి దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

"ఆకాశంలో సగం కాదు.. 'ఆమే' ఆకాశం. సంక్షేమంలో సగం కాదు.. 'ఆమే' అగ్రభాగం. మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శం. పుట్టిన ఆడబిడ్డ నుంచి అవ్వల వరకు అందరినీ కేసీఆర్ సర్కార్ కంటికి రెప్పలా కాపాడుతోంది.

గర్భిణులకు ఇచ్చే న్యూట్రిషన్ కిట్లు ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి తొలి అడుగు. ఆడబిడ్డ పుట్టిందంటే ఇంట్లో లక్ష్మీదేవి అడుగుపెట్టినట్టే. కేసీఆర్ కిట్‌తో పాటు అందే రూ.13 వేలు ప్రతి పుట్టిల్లు ఎప్పటికీ మరువలేని మేలు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మహిళా సంక్షేమంలో మనమే నంబర్ వన్..

## ఆడబిడ్డల అభివృద్ధికి కేసీఆర్ పెద్దపీట : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆడబిడ్డలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తూ దేశానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ఏ రాష్ట్రం చేయనన్ని పనులు తెలంగాణలో జరుగుతున్నాయని ఆమె వివరించారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరుపుకుంటున్న మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి కవిత శుభాకాంక్షలు తెలిపారు.

**ఆపద్బాంధవుడు కేసీఆర్ –** కళ్యాణ లక్ష్మితో ఇంటి పెద్దలా, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌తో ఇంటి డాక్టర్‌లా, కేసీఆర్ కిట్‌తో మేనమామలా, అమ్మఒడితో సంరక్షకుడిలా, ఆరోగ్య లక్ష్మితో ఆరోగ్య దాతగా, షీ టీమ్‌లతో రక్షకుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్‌తో భరోసానిస్తూ ఒంటరి మహిళలకు చేదోడుగా నిలిచారని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని రాజకీయ వ్యవస్థల్లో భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. బిందెలతో నీటికోసం కిలోమీటర్ల దూరం నడవకుండా, ఇంటికే సురక్షిత నీరు అందించాలన్న ఉద్దేశంతో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచిన ఆపద్బాంధవుడు కేసీఆర్ అని తెలిపారు. తెలంగాణ మహిళా లోకానికి అన్నగా, తమ్ముడిగా, మేనమామగా, ఇంటి పెద్దగా.. అన్నీ తానై ఆడబిడ్డకు ఏ ఆపదా రాకుండా కంటికి రెప్పలా కాపాడుతున్న మహిళా పక్షపాతి మన కేసీఆర్ అని కవిత కొనియాడారు. ఈ దశాబ్దంలో మహిళా సంక్షేమంలో దేశంలో తెలంగాణ దరిదాపుల్లోకి కూడా మరే రాష్ట్రం రానంత రీతిలో బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలను రూపొందించి, దిగ్విజయంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

**మహిళా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డు :** గత తొమ్మిది సంవత్సరాలలో 13,90,636 మంది బాలింతలు కేసీఆర్ కిట్ ద్వారా లబ్ధి పొందారని, 6.84 లక్షల మంది గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు, 18,46,635 మంది మహిళలకు అమ్మ ఒడి పథకం అందించి స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ లేనంతగా, మహిళా సంక్షేమంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందని వివరించారు. సీఎం కేసీఆర్ పాలనలో స్వరాష్ట్రంలో స్త్రీ జాతి సగర్వంగా, సంతోషంగా జీవించడం ఒక మహిళగా తనకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు.

**ఆసరా పెన్షన్లతో అండగా నిలబడ్డ కేసీఆర్ :** వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్లు అందిస్తూ వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీడి కార్మికులకు తెలంగాణలో మాత్రమే పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. 15, 85, 088 మంది వితంతువులకు నెలకు రూ. 2016 చొప్పున ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ. 20556.11 కోట్ల మేర పెన్షన్ రూపంలో అందించిందని, 143930 మంది ఒంటరి మహిళలకు రూ.1545.8 కోట్ల మేర పెన్షన్లు అందించిందని కవిత వివరించారు.

## మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కన్నుమూత

మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దయాకర్‌రెడ్డి మృతి పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సంతాపం వ్యక్తం చేశారు.. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొత్తకోట దయాకర్‌రెడ్డి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని పర్కాపురం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నుంచి దయాకర్‌రెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు సార్లు అమరచింత, ఒకసారి మక్తల్ నుంచి ఆయన గెలుపొందారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు.



## మాజీ ఎమ్మెల్యే కొత్తకోట మృతికి చంద్రబాబు సంతాపం



అమరావతి : మాజీ ఎమ్మెల్యే కొత్తకోట మృతికి టీడీపీ అధినేత చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మృతికి టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. దయాకర్ రెడ్డి తెలుగు దేశం పార్టీ నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కొద్ది కాలంగా ఆనారోగ్యంతో బాధ పడుతున్న దయాకర్ రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు ప్రాణాలు విడిచారు. దయాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు చంద్రబాబు తన సానుభూతి తెలియజేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ... సమర్థుడైన నాయకుడుగా దయాకర్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దయాకర్ రెడ్డి మృతి బాధాకరమన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలందించారన్నారు. దయాకర్ రెడ్డి తెలంగాణ ఉద్యమం సమయంలోనూ సీమాంధ్రులతో తోడ బుట్టిన సోదరుడిలా వ్యవహరించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు.

## మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శం : మంత్రి కేటీఆర్

మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ సర్కార్ అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడుతుందని తెలిపారు. ఆకాశంలో సగం కాదు.. ఆమే ఆకాశం అని.. సంక్షేమంలో సగం కాదు.. ఆమే అగ్రభాగం అని వ్యాఖ్యానించారు. అమ్మఒడి వాహనమైనా.. ఆరోగ్యలక్ష్మి పథకమైనా.. నీతి ఆయోగ్ ప్రశంసల వర్షం.. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ హర్షం దక్కిందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. భర్తను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు అన్నలా.. ఒంటరి మహిళలకు తండ్రిలా.. ఆడబిడ్డలకు మేనమామలా.. అవ్వలకు పెద్దకొడుకులా.. కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మనసారా ఆశీర్వదిస్తున్న యావత్ మహిళా లోకానికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. కల్యాణలక్ష్మి కేవలం పథకం కాదు%ా% ఒక విప్లవం అని తెలిపారు. ఓవైపు భ్రూణహత్యలకు బ్రేక్ వేసిందని.. మరోవైపు బాల్యవివాహాలకు ఫుల్ స్టాప్ పెట్టిందని.. ఇంకోవైపు తల్లిదండ్రుల భారాన్ని దించే భరోసా అని పేర్కొన్నారు. పదిలక్షలకుపైగా ఆడబిడ్డల పెండ్లిళ్లు చేసిన మేనమామ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లదూరం నడిచిన మహిళల కష్టాలను మిషన్ భగీరథతో శాశ్వతంగా తీర్చిన విజన్ ఉన్న ముఖ్యమంత్రి.. కేసీఆర్ అని అన్నారు. మన అంగన్వాడీలను, ఆశా కార్యకర్తలను వెవట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి.. దేశంలోనే అత్యధిక పారితోషికాలు ఇచ్చి గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించారన్నారు. ఆడబిడ్డల సంక్షేమంలో మనకు ఎదురులేదని.. మహిళా సాధికారతలో తెలంగాణకు తిరుగులేదని వ్యాఖ్యానించారు.




ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవీ రిహ్‌పై రష్యా సోమవారం అర్ధరాత్రి క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఓ ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం సహా పలు ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

శిథిలాల కింద ఎవరైనా చిక్కుకుపోయి ఉండొచ్చని ఆ నగర మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన చిత్రాలను డెనిప్రోపెట్రోవ్స్క్ గవర్నర్ షెర్హీలిసాక్ టెలిగ్రామ్‌లో పోస్టు చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు చనిపోగా.. దాదాపు 25 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. ఇక దాడిలో దెబ్బతిన్న ఐదంతస్తుల భవనం ఇప్పటికీ మంటల్లోనే చిక్కుకొని ఉందన్నారు. మరోవైపు కీవ్‌పై కూడా రష్యా దాడులను కొనసాగించింది. కానీ, ఆ నగరానికి రక్షణగా ఉన్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పలు క్షిపణులను కూల్చివేశాయని కీవ్ ప్రాంత మిలిటరీ రీజియన్ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు నగరాల్లో నిన్న మొత్తం గగనతల రక్షణ వ్యవస్థ సైరన్ మోగుతూనే ఉంది. మరోవైపు ఖర్కీవ్‌పై డ్రోన్ దాడులు జరిగినట్లు మేయర్ వెల్లడించారు. ప్రధానంగా పౌర నివాసాలపై రష్యా డ్రోన్లు దాడులు చేసినట్లు తెలిపారు. క్రైవ్‌స్కీ జిల్లాలో ఓ కంపెనీ, సాల్టివిస్కీ జిల్లాలో ఓ గిడ్డంగి దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.

**ప్రజలను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులు..** క్రైవీ రిహ్‌పై రష్యా దాడులు చేయడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఖండించారు. "రష్యా హంతకులు.. సామాన్య ప్రజలు, వారు నివశించే భవనాలు, పట్టణాలపై యుద్ధం ప్రకటించారు" అన్నారు.

రష్యా దాడిలో మృతి చెందిన వారికి సంతాపం.. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనకు కారణమైన క్షిపణులను ప్రయోగించిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.


# 15న నాగపూర్ బీఆర్ఎస్ భవనం ప్రారంభం..

## కేసీఆర్ చేతుల మీదుగా శ్రీకారానికి చర్యలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ తన తొలి సొంత శాశ్వత భవనాన్ని మహారాష్ట్రలో ప్రారంభించబోతున్నది. నాగపూర్‌లో సువిశాలమైన కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆ భవనాన్ని ఈ నెల 15న పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. 15న ఉదయం నాగపూర్ వెళ్లనున్న కేసీఆర్.. అక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు స్థానికంగా ఏర్పాటు చేసిన చేరికల సమావేశంలోనూ పాల్గొంటారు. ముంబై, పుణె, ఔరంగాబాద్‌లోనూ పార్టీ ఆఫీస్‌లను ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు పార్టీ భవనాల కోసం అన్వేషణ జరుగుతున్నది. బీఆర్ఎస్‌కు మహారాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతుండగా, పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల నియామక కార్యక్రమాన్ని చేపట్టింది. అటు.. ఈ నెల 19న నాందేడ్‌లో పార్టీ అధినేత కేసీఆర్ రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



## ఆప్తమిత్రుడిని కోల్పోయా.. కొత్తకోట మృతిపట్ల మంత్రి ఎర్రబెల్లి కంటతడి



హైదరాబాద్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి పట్ల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి కొత్తకోట దయాకర్ రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి భావోద్వేగానికి గురయ్యారు. ఆప్తమిత్రుడిని కోల్పోయానంటూ కంటతడి పెట్టారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. అనంతరం కొత్తకోట దయాకర్ రెడ్డి సతీమణి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డిని పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తకోట దయాకర్ రెడ్డి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దయాకర్‌రెడ్డి మృతి పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సంతాపం వ్యక్తం చేశారు.

## భట్టి విక్రమార్కది పాదయాత్ర కాదు.. కలహాల యాత్ర : గుత్తా సుఖేందర్ రెడ్డి

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఘర్షణ, అంతర్గత సమస్యలు లేకుండా భట్టి పాదయాత్ర జరగడం లేదని.. ఆయనది ఆయనది కలహాల పాదయాత్ర అని విమర్శించారు. భట్టి పాదయాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుకుంటున్నారని అన్నారు. నల్లగొండ జిల్లాపై భట్టి విక్రమార్కకు అవగాహన లేదని అన్నారు. జలయజ్ఞం పేరుతో కాంగ్రెస్ మొదలుపెట్టిన ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పూర్తి చేసి నీళ్లు అందిస్తున్నారని తెలిపారు.

భట్టి విక్రమార్క పాదయాత్రను ప్రజలు పట్టించుకోవడం లేదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. భట్టి రోజుకు మూడు కిలోమీటర్లు నడుస్తున్నారని.. అసలు ఇదేమీ పాదయాత్ర అని ప్రశ్నించారు. భట్టి పాదయాత్ర నల్లగొండ దాటేది లేదని ఎద్దేవా చేశారు. అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాంగ్రెస్ నేతల పని అని విమర్శించారు. బీజేపీ అభివృద్ధి నిరోధకులు అని.. అభివృద్ధిని చూసి బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఇక తాను



బీఆర్ఎస్‌లోకి ఎందుకు వచ్చాననేది కూడా ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు. చంద్రబాబు ఎంపీ టికెట్ ఇవ్వనందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాలు చూడలేక బీఆర్ఎస్‌లోకి వెళ్లానని స్పష్టం చేశారు.

## పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం.. మంత్రి నిరంజన్ రెడ్డి

పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పత్తి సాగుకు రైతులు ఉపయోగించేది BG II హైబ్రిడ్ విత్తనాలు అని.. అన్ని కంపెనీల పత్తి విత్తనాలు ఒక్కటే రకమైనవేనని తెలిపారు. ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేసే ఈ విత్తనాల 400 గ్రాముల ప్యాకెట్ ధరను కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.450గా నిర్ణయించిందని పేర్కొన్నారు. పత్తి విత్తనాల ధరను నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వమే అయినప్పటికీ వాటి నియంత్రణ రాష్ట్రాల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. అయితే కొన్ని కంపెనీలు దురాశతో పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. అటువంటి డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని.. అవసరమైతే వాళ్ల లైసెన్స్‌లు రద్దు చేయడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు.

విత్తనాలు దొరకవేమో అని రైతులు కంగారు పడొద్దని.. అవసరమైన దానికంటే అధికంగానే పత్తి విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో



పత్తి సాగవుతుందని అంచనా వేశారని.. అంటే 58,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని పేర్కొన్నారు.

అయితే మార్కెట్‌లో అన్ని కంపెనీల విత్తనాలు కలిపి 77,500 క్వింటాళ్ల వరకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

## మమతా బెనర్జీకి 600 కిలోల మామిడిపండ్లు పంపిన బంగ్లాదేశ ప్రధాని

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి అరుదైన గిఫ్ట్ వచ్చింది. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా సుమారు 600 కిలోల మామిడి పండ్లను బెంగాల్ సీఎంకు పంపారు. హిమసాగర్, లంగ్రా రకాలకు చెందిన మామిడి పండ్లను హసీనా గిఫ్ట్‌గా పంపారు. దౌత్యపరమైన సంబంధాల్లో భాగంగా ఈ గిఫ్ట్‌ను అందజేశారు. గత ఏడాది కూడా మామిడి పండ్లను పంపినట్లు బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ అధికారి తెలిపారు. బెంగాల్ సీఎంతో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు కూడా హసీనా మామిడి పంట్లను పంపించారు. గత ఏడాది ప్రధాని మోదీకి కూడా హసీనా పండ్లను గిఫ్ట్‌గా అందజేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com